http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శుక్రవారం 31 జూలై 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## పశ్చిమాసియా సంక్షోభంపై
# కేంద్రం అలర్ట్

- ఇంధన భద్రత, భారతీయుల రక్షణపై మోదీ కీలక ఆదేశాలు
- పశ్చిమాసియా పరిస్థితిపై నాలుగోసారి కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశం
- ఇంధనం, ఎరువుల సరఫరాపై సమీక్ష, సముద్ర నావికుల భద్రతకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచన



## తప్పుడు ప్రచారాలు
# నమ్మవద్దు

- ఇందిరమ్మ ఇళ్ల పథకంపై వదంతులు నమ్మొద్దన్న హౌసింగ్ బోర్డు వీసీ వి.పి.గౌతమ్
- క్యూర్ పరిధిలో ఇళ్లకు దరఖాస్తు చేస్తే ఇతర పథకాలు నిలిచిపోవని స్పష్టీకరణ
- సోషల్ మీడియా ప్రచారాలు నమ్మొద్దని విజ్ఞప్తి




హైదరాబాద్

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతమ్ తెలిపారు. క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసినట్లయితే పథకాలు నిలిచిపోవని ఆయన స్పష్టం చేశారు. - మిగతా3లో



## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం

- రాజ్యసభకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు
- కేంద్రంపై ప్రతిపక్ష నేత ఖర్గే విమర్శలు
- అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్
- రాజకీయాల కోసమే బిల్లు తెచ్చారని ఆరోపణ
- పేపర్ లీక్‌లపై అమలు వ్యవస్థ బలోపేతం చేయాలని సూచన
- విద్యార్థుల ఉద్యమం వల్లే ప్రభుత్వం దిగివచ్చిందన్న ఖర్గే

## 2034 వరకు నేనే
# ముఖ్యమంత్రి

- విద్యలో నాణ్యత పెరగాలి
- విద్యాశాఖకు నేనెందుకు రాజీనామా చేయాలి?
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యత తాను తీసుకుంటానన్న సీఎం రేవంత్
- విద్యకోసం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధమని వెల్లడి
- ఏడాదికి 10 నుంచి 12 మంది టీచర్లను విదేశాలకు పంపిస్తామని స్పష్టీకరణ



హైదరాబాద్

ఆర్థిక సమస్యలు వెనకబాటుతనానికి కారణం కావటం లేదని, కేవలం విద్య లేకపోటవమే కారణమవుతోందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఐదేళ్ల పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికోసం కృషి చేయాలని ఉపాధ్యాయుల బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. మండల స్థాయిలో పాఠశాలల సమస్యలను ఉపాధ్యాయ సంఘాలు డిసెంబర్ నాటికి ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. 2034 వరకు తానే సీఎంగా ఉంటానన్న రేవంత్ రెడ్డి మధ్యతరగతి నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదివి తాను సీఎం అయ్యానని గుర్తుచేశారు. ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా విధానాలు, పాఠశాలలు అవలంభిస్తున్న విధానాలను స్టడీ చేసి వచ్చిన ఉపాధ్యాయులతో సీఎం ఇంటరాక్ట్ అయ్యారు. ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యలో నాణ్యత పెరగాలని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఇటీవల జర్మనీ, ఫిన్లాండ్ దేశాల్లో పర్యటించి అక్కడి విద్యా వ్యవస్థను స్టడీ - మిగతా3లో

## పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

- రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు
- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్



## కూరగాయల సాగును
# ప్రోత్సహించండి

- సెంట్రలైజ్ కిచెన్ల చుట్టూ ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రోత్సాహం
- రైతులకు 75% సబ్సిడీతో విత్తనాలు
- రైతులు పండించిన పంటలను
- ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి
- ఎల్ నినోపై రూపొందించిన నివేదికను సీఎంకు అందజేసిన నిపుణుల కమిటీ



హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖతోపాటు ఇతర అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేసి రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని సూచించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను భారీ సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం- మిగతా3లో

## ఈ20 పెట్రోల్ వాహనాలకు సురక్షితమే

- ఇంజిన్ దెబ్బతినదు కానీ మైలేజ్ తగ్గొచ్చు!'- కేంద్రం కీలక ప్రకటన
- ఈ20 పెట్రోల్ వల్ల వెహికిల్ ఇంజిన్‌కు నష్టం లేదన్న కేంద్రం
- 20 కోట్ల బైకులు, 3 కోట్ల కార్లలో సమస్యల్లేవని స్పష్టం
- కొన్ని వాహనాలకు మైలేజ్ స్వల్పంగా తగ్గొచ్చని క్లారిటీ- వందేమాతరం బిల్లు ఆమోదం





## యువతకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకమే కీలకం

- కేంద్రం ఆ హామీలను నిలబెట్టుకుంటే సంతోషం: వాంగ్‌చుక్
- వందే భారత్ ప్రయాణాన్ని ప్రశంసించిన సోనమ్ వాంగ్‌చుక్
- విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు పెట్టొద్దంటూ కేంద్రానికి విజ్ఞప్తి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దిప్కే డిమాండ్

## కృష్ణా, గోదావరి
# పరవళ్లు

మెండుగా వానలు.. నిండుగా ప్రాజెక్టులు!

- కృష్ణా పరీవాహకంలో ఆల్మట్టి నుంచి జూరాల వరకు గేట్లు ఎత్తివేత...
- శ్రీశైలం ప్రాజెక్టుకు క్రమంగా పెరుగుతున్న వరద
- ఎగువ గోదావరిలోనూ వరద ఉధృతి.. శ్రీరాంసాగర్‌కు భారీ ప్రవాహం
- పోటెత్తిన కడెం, ప్రాణహిత, ఇంద్రావతి
- కడెం గేట్లు ఎత్తివేత.. ఎల్లంపల్లి, మేడిగడ్డ, సమ్మక్క, సీతమ్మసాగర్‌కు భారీ వరద
- నేడు భద్రాచలం వద్ద 10 లక్షల క్యూసెక్కులకు చేరనున్న వరద ప్రవాహం



హైదరాబాద్ /గద్వాల/మంచిర్యాలరూరల్

బిరబిరా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది..గలగలా గోదావరి పరుగులు పెడుతోంది. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరపి లేని వర్షాలతో కృష్ణా, గోదావరి నదులు వరదెత్తాయి. శ్రీశైలం ప్రాజెక్టు వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. దీంతో ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. గురువారం ఉదయం 6 గంటలకు జలాశయానికి 30,194 క్యూసెక్కుల వరద రాగా, సాయంత్రం 6 గంటల వరకు 89,240 క్యూసెక్కులకు పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు - మిగతా3లో

# పశ్చిమాసియా సంక్షోభంపై కేంద్రం అలర్ట్



దేశ ప్రయోజనాలు, ఇంధన భద్రత, విదేశాల్లోని భారతీయుల రక్షణకు ఎలాంటి ఆటంకం కలగకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు వేగవంతం చేసింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం దిల్లీలో కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) నాలుగో ప్రత్యేక సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రస్తుత భౌగోళిక-రాజకీయ పరిస్థితులు, వాటి ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉండొచ్చన్న అంశాలపై సమగ్రంగా చర్చించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా హోల్ ఆఫ్ గవర్నమెంట్ విధానాన్ని కొనసాగించాలని ప్రధాని స్పష్టం చేశారు. సమావేశంలో కేబినెట్ కార్యదర్శి ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులపై వివరించారు. ముఖ్యంగా పశ్చిమాసియా ఘర్షణలు, ఎర్ర సముద్రం, హర్మూజ్ జలసంధి, గల్ఫ్ ఆఫ్ ఏడెన్, బ్లాక్ సీ ప్రాంతాల్లో నెలకొన్న భద్రతా సమస్యలు భారత దిగుమతులు, సరఫరా వ్యవస్థపై చూపుతున్న ప్రభావాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్ఎన్జీ, ఎల్పీజీ, ఎరువుల సరఫరా అంతరాయం లేకుండా కేంద్రం చేపట్టిన చర్యలను కూడా వివరించారు. ప్రస్తుతం దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు, సరఫరా పరిస్థితి సంతృప్తికరంగానే ఉందని సమావేశంలో వెల్లడించారు. ముడి చమురు లభ్యత సమృద్ధిగా ఉండటంతో ప్రభుత్వ రంగ రిఫైనరీలు 100 శాతానికి పైగా సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దీంతో పెట్రోల్, డీజిల్ తదితర ఇంధన ఉత్పత్తుల తయారీ నిరంతరాయంగా కొనసాగుతోందని వివరించారు.

**ఎల్?పీజీపై కేంద్రం ప్రత్యేక దృష్టి**

ఎల్పీజీ సరఫరాపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒకే దేశంపై ఆధారపడకుండా ఎల్పీజీ కొనుగోలు వనరులను ఇప్పటికే విస్తరించినట్లు అధికారులు తెలిపారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ల విస్తరణకు చర్యలు చేపట్టడంతో గ్యాస్ వినియోగం పెరుగుతోందని వెల్లడించారు. జాతీయ గ్యాస్ గ్రిడ్ విస్తరణ, ఎల్ఎన్జీ దిగుమతుల సామర్థ్య పెంపు, సిటీ గ్యాస్ పంపిణీ వ్యవస్థ విస్తరణ, పైప్లైన్ మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధి వంటి చర్యల ద్వారా ఎల్పీజీపై ఆధారాన్ని క్రమంగా తగ్గించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని సమావేశంలో చర్చించారు. రాబోయే రబీ సీజన్కు అవసరమైన ఎరువుల లభ్యతపైనా ప్రధాని ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అవసరమైన ఎరువుల నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ దిగుమతి వనరులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరా నిరంతరాయంగా కొనసాగాలని స్పష్టం చేశారు. పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం సముద్ర రవాణాపైనా పడుతున్న నేపథ్యంలో దేశీయ, విదేశీ నౌకల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల భద్రతపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఘర్షణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సముద్ర నావికులకు, వారి కుటుంబాలకు అవసరమైన సమాచారం, అత్యవసర సహాయం, మానసిక పరామర్శ అందించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు.

**ఇంధన వనరులపై మరింత దృష్టి**

విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత కూడా కేంద్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య అంశమని ప్రధాని స్పష్టం చేశారు. పశ్చిమాసియా దేశాల్లో నివసిస్తున్న భారతీయుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు. దీర్ఘకాలిక ఇంధన భద్రత సాధించాలంటే పునరుత్పాదక ఇంధన వనరులపై మరింత దృష్టి పెట్టాలని కూడా ప్రధాని పేర్కొన్నారు. ముఖ్యంగా సౌరశక్తి, ఇతర శిలాజ ఇంధనేతర వనరుల వినియోగాన్ని వేగంగా పెంచడం ద్వారా విదేశీ ఇంధనంపై ఆధారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్తో పాటు ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్, షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్పూరీ హాజరయ్యారు. ఆయా శాఖలు తీసుకుంటున్న చర్యలపై మంత్రులు ప్రధానికి వివరించారు. ప్రస్తుతం భారత ఇంధన అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. గతంలో దేశ ఇంధన దిగుమతుల్లో దాదాపు 40 శాతం హర్మూజ్ జలసంధి మార్గం ద్వారానే వచ్చేవి. అయితే ఆ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ఎర్ర సముద్రం, బాబ్ అల్-మందబ్ ప్రాంతాల్లో నౌకలపై దాడులు పెరగడంతో ప్రపంచ సరఫరా వ్యవస్థపై ప్రభావం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో దేశ ప్రజల ప్రయోజనాలు, ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ఈ20 పెట్రోల్ వాహనాలకు సురక్షితమే



ఈ20 పెట్రోల్ (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వల్ల వాహనాల ఇంజిన్లు త్వరగా దెబ్బతింటాయా తుప్పు పట్టి వాహనాల ఆయుష్షు తగ్గుతుందా? ఇటీవలి కాలంలో ఈ అంశంపై సోషల్ మీడియాలో, వాహనదారుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం లోక్సభ వేదికగా దీనిపై స్పష్టత ఇచ్చింది. ఈ20 ఇంధనం వల్ల ఇంజిన్ భాగాలు అరిగిపోవడం, తుప్పు పట్టడం లేదా వాహనం కాల పరిమితి తగ్గడం వంటి సమస్యలేవీ తలెత్తడం లేదని ప్రభుత్వం సమర్థించుకుంది. ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం భారత్కు ఇంధన భద్రతను అందించడంతో పాటు అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం నుంచి సామాన్య వినియోగదారుల్ని కాపాడుతుందని పేర్కొంది. లోక్సభలో అడిగిన ఒక ప్రశ్నకు పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నీతి ఆయోగ్, వాహన తయారుదారులు, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐఏఎం), ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలు (ఓఎంసీఎస్), ఇతర సాంకేతిక సంస్థల సలహాలతో దశలవారీగా, శాస్త్రీయంగా ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్లు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విస్తృత ప్రయోగాలు, ఫీల్డ్ ట్రయల్స్లో ఈ20 ఇంధనం వాహనాలకు పూర్తి సురక్షితమని నిరూపితమైందని సురేశ్? గోపి వెల్లడించారు.

**'ఇంజిన్ విఫలమైనట్లు ఆధారాల్లేవ్'**

ఇప్పటికే దేశంలో 15 శాతం ఇథనాల్ కలిగిన ఈ15ం పెట్రోల్ 3 సంవత్సరాలకుపైగా, 19-20 శాతం ఇథనాల్ కలిగిన ఈ19-ఈ20 ఇంధనం రెండున్నర సంవత్సరాలకుపైగా వినియోగంలో ఉందని ప్రభుత్వం గుర్తుచేసింది. ఈ కాలంలో 20 కోట్లకుపైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకుపైగా పెట్రోల్ కార్లు ఈ ఇంధనంతో నడిచినా, ఇథనాల్ బ్లెండింగ్ కారణంగా ఇంజిన్ విఫలమైనట్లు ధ్రువీకరించిన ఆధారాల్లేవని తెలిపింది. ప్రభుత్వం ప్రకారం ఈ20 ఇంధనం ఎక్కువ ఆక్టేన్ వాల్యూ, మెరుగైన పనితీరు, తక్కువ కాలుష్యం వంటి ప్రయోజనాలు కలిగి ఉంది. దీంతో ఇంజిన్ మరింత సమర్థంగా పనిచేస్తుందని స్పష్టం చేసింది. ఇంకా పబ్లిక్ సెక్టార్ చమురు మార్కెటింగ్ కంపెనీలు రైతుల వద్ద ఇథనాల్ను మంచి మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నాయని ప్రభుత్వం వివరించింది. జు20 ఫ్యూయెల్ క్యాంపెయిన్ చమురు కంపెనీలకు లాభం కోసం కాకుండా ఇంధన భద్రత, ధరల్లో స్థిరత్వం, రైతుల సంక్షేమం, విదేశీ మారక నిల్వల ఆదా కోసం చేపట్టిన వ్యూహాత్మక చర్య అని తెలిపింది.

**'ఇంధన ధరల్ని పరిమితంగానే పెంచాం'**

భారతదేశం క్రూడ్ ఆయిల్ దిగుమతులపై అధికంగా ఆధారపడుతున్నందున ఆ భారాన్ని తగ్గించుకునేందుకు దేశీయంగా ఇథనాల్ మిశ్రమం వ్యూహాత్మకంగా కూడా కీలకం అని పేర్కొంది. మరోవైపు పశ్చిమాసియా సంక్షోభ సమయంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగినా, దేశీయంగా ఇంధన ధరలు పరిమిత స్థాయిలోనే పెరిగాయని కేంద్రం తెలిపింది. 2026 ఫిబ్రవరి నుంచి క్రూడ్ ధరలు 70-80 శాతం వరకు పెరిగినా దేశీయంగా 7-8 శాతం మాత్రమే పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ముడి చమురు ధర గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు పెట్రోల్ ధర లీటరుకు రూ. 125 వరకు వెళ్లే అవకాశం ఉన్నా, దిల్లీలో వినియోగదారులకు రూ. 94.77 కే అందించినట్లు తెలిపింది.

**మైలేజ్ 2-6 శాతం వరకు తగ్గొచ్చు: నితిన్ గడ్కరీ**

ఇక జు20 పెట్రోల్ వాడితే వాహనాల మైలేజ్ 2 నుంచి 6 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్సభలో తెలిపారు. ఇది వాహనం, మోడల్ను బట్టి ఉంటుందన్నారు. అంతే కానీ ఈ ఇంధనం వల్ల ఇంజిన్ దెబ్బతినడం, పనితీరు తగ్గడం లేదా ఇతర సాంకేతిక లోపాలు వచ్చినట్లు ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేశారు. ఈ20 పెట్రోల్తో మరింత మెరుగైన యాక్సిలరేషన్, సాఫీ రైడ్ క్వాలిటీ సహా కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు.

**వందేమాతరం బిల్లు ఆమోదం**

యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం తర్వాత రోజు కూడా లోక్సభలో వాయిదాలపర్వం కొనసాగింది. గురువారం ఉదయం 11గంటలకు సభ సమావేశం కాగానే వివిధ అంశాలపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. వెల్లోకి దూసుకెళ్లి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగనివ్వాలని స్పీకర్ ఓంబిర్లా కోరినప్పటికీ విపక్ష సభ్యులు నినాదాలు ఆపలేదు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనటంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత తిరిగి సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేకపోవటంతో మధ్యాహ్నం 3 గంటల వరకు మళ్లీ వాయిదావేశారు. ఆ తర్వాత తిరిగి సమావేశమైన లోక్సభ జాతీయ గేయం 'వందేమాతరం' అవమానాన్ని నివారించే బిల్లుపై స్వల్ప చర్చ తర్వాత ఆమోదించింది. అనంతరం లోక్సభ శుక్రవారానికి వాయిదాపడింది.

# యువతకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకమే కీలకం

నీట్- యూజీ ప్రశ్నాపత్రం లీక్ అంశంపై దిల్లీలోని జంతర్మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఉద్యమం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ కోరారు. ముఖ్యంగా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్లు నమోదు చేయబోమని ఇచ్చిన హామీని తప్పకుండా నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ మేరకు ఎక్స్లో ఓ వీడియో పోస్టు చేశారు. 'భారతీయ రైల్వేపై నాకు ఎంతో గర్వంగా ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అదే స్థాయిలో నిలబెట్టుకుంటే మరింత సంతోషిస్తాను' అంటూ వాంగ్చుక్ వ్యాఖ్యానించారు. దిల్లీ నుంచి లద్దాఖ్? తిరుగు ప్రయాణంలో వందే భారత్ ఎక్స్ప్రెస్లో ప్రయాణించిన ఆయన, తన అనుభవాన్ని పంచుకున్నారు. లద్ధాఖ్?కు వెళ్లే మార్గంలో దిల్లీ- శ్రీనగర్ వందే భారత్లో ప్రయాణించిన వాంగ్చుక్, చినాబ్ రైల్వే వంతెనపై ప్రయాణం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. "రైలు ప్రయాణం నాకు ఎప్పటినుంచో ఇష్టమైనది. ఆ ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా అనిపించింది. భారతీయ రైల్వే సాధించిన అభివృద్ధి నిజంగా ప్రశంసనీయం" అని ఆయన వీడియో సందేశంలో తెలిపారు. "యువతతో నమ్మకమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడం ఏ ప్రభుత్వానికైనా చాలా ముఖ్యం. విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. ఆ మాటను నిలబెట్టుకోవాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది" కాగా, పార్లమెంట్లో ప్రజా పరీక్షల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ఆయన స్వాగతించారు. ఈ బిల్లు కేవలం పరీక్షల వ్యవస్థలోనే కాకుండా దేశ విద్యా వ్యవస్థలోనూ సమగ్ర మార్పులకు దారితీయాలని ఆకాంక్షించారు. గత నెలలో నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన 36 రోజుల ఉద్యమానికి సోనం వాంగ్చుక్ మద్దతు తెలిపారు. జూన్ 28 నుంచి ఆయన నిరాహార దీక్ష చేపట్టగా, ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేంద్రం ప్రధాన డిమాండ్లను అంగీకరించడంతో ఆయన తన దీక్షను విరమించారు.

**అమిత్ షా రాజీనామాకు దీప్కే డిమాండ్**

అదే సమయంలో సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే మరోసారి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జూలై 20న నిర్వహించిన సంసద్ చలో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని ఆరోపించారు. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "విద్యార్థులపై బలప్రయోగానికి ఆదేశాలు అమిత్ షా నుంచే వచ్చి ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ఇప్పుడు కేవలం ప్రతిపక్షాల బాధ్యత మాత్రమే కాదు. దేశ ప్రజలందరూ కలిసి రావాల్సిన అవసరం ఉంది" అని మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్లో మీడియాతో మాట్లాడుతూ దీప్కే అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. అలాగే కొత్త విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషిపై కూడా విమర్శలు చేశారు. యోగ గురువు బాబా రామ్దేవ్ చేసిన వ్యాఖ్యలపైనా దీప్కే స్పందించారు. జంతర్మంతర్ ఉద్యమం భారతీయ సంస్కృతిని దెబ్బతీసిందన్న రామ్దేవ్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. "మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రాలతో రాజ్యాంగబద్ధంగా ఉద్యమించడం సంస్కృతిని అవమానించడం ఎలా అవుతుంది? యువత దేశాన్ని, సంస్కృతిని చక్కగా ముందుకు తీసుకెళ్లగలదు" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, దిల్లీ పోలీసులు నిరసనల సమయంలో రాళ్లతో నిండిన ట్రక్కులను ఉద్యమ ప్రాంతానికి తీసుకొచ్చారని కూడా దీప్కే ఆరోపించారు.

## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం



ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026పై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి జరిగిందని ఖర్గే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, సీఆర్పీఎఫ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తు చేశారు. ఆ శాఖ అనుమతి లేకుండా ఇలాంటి చర్యలు జరిగే అవకాశం లేదని అన్నారు. ఈ ఘటనపై అమిత్ షా బాధ్యత నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే బిల్లును ఇంత ఆలస్యంగా ఎందుకు తీసుకొచ్చారని ఖర్గే ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే సంస్కరణలు చేయకుండా ప్రభుత్వం రాజకీయాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలను చల్లార్చేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. బీజేపీ రాజకీయాల వల్లే దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరసనలు, పోలీసు చర్యలు చోటుచేసుకున్నాయని అన్నారు. పేపర్ లీకేజీలు జరిగిన తర్వాత నష్టనివారణ చర్యలు తీసుకోవడం ఒక్కటే సరిపోదని ఖర్గే అభిప్రాయపడ్డారు. అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అమలు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం అనుసరించబోయే స్పష్టమైన కార్యాచరణను వివరించలేదని విమర్శించారు. ఈ బిల్లు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా పరీక్షల వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేశారని ఖర్గే గుర్తుచేశారు. వారి గొంతుకను ప్రతిపక్షం వీధుల నుంచి పార్లమెంట్ వరకు వినిపించిందన్నారు. ప్రజల ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం చివరకు వెనక్కి తగ్గిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల పోరాటం ఫలించిందని, వారి ఉద్యమం వల్లే ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. అధికారాన్ని కోల్పోతామన్న భయంతోనే ప్రభుత్వం డిమాండ్లకు తలొగ్గిందని ఆరోపించారు.

## పేపర్ లీక్లపై కేంద్రం ఉక్కుపాదం..



దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడీ వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది. ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమా లకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది. 2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు. అయితే ప్రతిపక్షం మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.

## దేశంలో అడుగు పెట్టిన వెంటనే

## హసీనాను అరెస్ట్ చేస్తాం.. బంగ్లా మంత్రి హెచ్చరిక!

స్వదేశానికి వెళ్లాలనుకుంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం మరోసారి తన కఠిన వైఖరి వెల్లడించింది. దేశంలో అడుగుపెట్టిన క్షణమే ఆమెను అరెస్ట్ చేస్తామని ఆ దేశ న్యాయశాఖ మంత్రి ఎం.అసదుజ్జమాన్ స్పష్టం చేశారు. చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామని, ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండదని పేర్కొన్నారు. ఫ్రాన్స్కు చెందిన వార్తా సంస్థ ఏఎఫ్పీకి ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఈ ఏడాది డిసెంబర్లోగా స్వదేశానికి తిరిగి వెళ్తానని చెప్పారు. తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, హత్య కూడా చేయొచ్చని తెలుసని, అయినా ప్రజలు పిలుస్తున్నందున తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. గత నెలలో ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కూడా ఎన్ని అడ్డంకులు వచ్చినా బంగ్లాదేశ్కు వెళతానని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన న్యాయశాఖ మంత్రి, మరణశిక్ష పడిన వ్యక్తిగా హసీనాకు కోర్టులో నేరుగా లొంగిపోయే అవకాశం కూడా దక్కకపోవచ్చని అన్నారు. ఆమె బంగ్లాదేశ్ పౌరురాలిగా స్వదేశానికి వచ్చే హక్కు ఉన్నా, దేశంలోకి ప్రవేశించిన వెంటనే చట్ట ప్రకారం అరెస్ట్ చేస్తామని చెప్పారు. మధ్యంతర ప్రభుత్వం ఇప్పటికే షేక్ హసీనా పాస్పోర్టును రద్దు చేసింది. అలాంటప్పుడు ఆమె ఎలా వస్తారన్న ప్రశ్నకు అది ఆమె సమస్యని మంత్రి వ్యాఖ్యానించారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

-మొదటిపేజీ తరువాయి

సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ల పరిసర ప్రాంతాల్లో కూరగాయల ఆర్గానిక్ పద్ధతిలో సాగును ప్రోత్సహించాలని, అక్క డ పండే తాజా కూరగాయలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసి కిచెన్లకు సరఫరా చేసే వ్యవస్థను అభివృద్ధి చేయా లని సూచించారు. దీంతో రైతులకు గిట్టు బాటు ధర లభించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, తాజా ఆహారం అందుబాటులోకి వస్తుందన్నారు. గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రికి ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం, వ్యవసాయంపై దాని ప్రభావం, తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై డాక్టర్ చిన్నారెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల కమిటీ నివేదికను సమరి?పంచింది. ఈ సందర్భంగా కమిటీ చేసిన సిఫార్సులపై సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతుల ఆదాయానికి భరోసా కలి?పంచడంతోపాటు ఆహార భద్రతను కాపాడే విధంగా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక**

ప్రతి గ్రామానికి ప్రత్యేక అత్యవసర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కమిటీ సూచించింది. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో 32 లక్షల ఎకరాల్లో వరి, సాగు తగ్గిందని, అందుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను ప్రోత్సహించాలని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఆయా ప్రాంతాల భూస్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను బట్టి పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని పేర్కొంది. ఈ పంటలకు అవసరమైన విత్తనాలను 75% సబ్సిడీపై అందించడంతో పాటు, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని సిఫార్సు చేసింది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రత్యేకంగా ప్రోత్సహించాల ని పేర్కొంది. నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమీకృత కూరగాయల ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేయాలని తెలిపింది.




**పశుగ్రాసం, డెయిరీపై దృష్టి**

వ్యవసాయంతోపాటు పశుసంవర్ధక రంగాన్ని కూడా బలోపేతం చేయాలని కమిటీ సూచించింది. పశుగ్రాస విత్తనా లను సబ్సిడీపై అందించి పశుగ్రాస సాగును పెంచాలని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త డెయిరీ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించాలని సిఫార్సు చేసింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు అందించాలని, ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల నిర్వహణపై ప్రత్యేక సలహాలు ఇవ్వాలని సూచించింది. ఆయా బృందాలు పంటల పరిస్థితి, నీటి లభ్యత, రైతుల సమస్యలను నిరంతరం పరిశీ లించి ప్రభుత్వానికి నివేదికలు అందించాలని పేర్కొంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రూ.803 కోట్లతో కార్యాచరణ**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు తదితర రంగాలకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రాష్ట్ర నిపుణుల కమిటీ ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమని కమిటీ అంచనా వేసింది. సీఎంకు నివేదిక సమర్పించిన అనంతరం జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నష్టాన్ని తగ్గించడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలకు నివేదికలో ప్రాధాన్యం ఇచి?చనట్లు తెలిపారు. జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలమట్టం తగ్గడంతో నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలను గ్రామాల వారీ కార్యాచరణతో ప్రోత్సహించాలన్నారు.

# తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు

-మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. స్థలం లేని వారికి సొంతింటి కలను నెలవేర్చడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని హౌసింగ్ బోర్డు వీసీ వి.పి.గౌతమ్ తెలిపారు. ఈ పథకంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న వదంతులను నమ్మొద్దని ఆయన వివరించారు. దీని వల్ల ఇతర పథకాలు, ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వి.పి.గౌతమ్ హెచ్చరించారు.

**రూ.5 లక్షల సబ్సిడీతో**

ఈ పథకం కింద ప్రతిపాదించిన ఫ్లాట్లు ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో సుమారు 525 చ.అడుగుల విస్తీర్ణంతో నిర్మిస్తారు. ఒక్కో ఫ్లాట్ ఖరీదు రూ.40-60 లక్షల వరకు ఉంటుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు అన్ డివైడెడ్ షేర్ కింద 20-25 గజాల స్థలాన్ని కూడా లబ్దిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేపడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో తెలిపారు. లబ్దిదారుడు కేవలం రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

**సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ నంబర్**

క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్స్‌పై వస్తున్న సందేహాల నివృత్తికి ప్రత్యేక కాల్ సెంటర్, హెల్ప్‌లైన్ నంబర్‌ను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రజలు




ఎలాంటి సందేహాలు ఉన్నా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవచ్చు. దీని ద్వారా పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర విషయాలపై సమగ్ర సమాచారాన్ని అందిస్తారు.

**నిబంధనలు ఇవే**

దరఖాస్తుదారుల సౌకర్యార్థం తెలుగు , హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో సమాచారం తెలియజేస్తారు. ప్రభుత్వం నుంచి సరైన సమాచారం అందించేందుకు ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని కొద్దిరోజుల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దరఖాస్తుదారు క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివాసం ఉండాలని, దరఖాస్తుదారు లేదా కుటుంబానికి ఓఆర్‌ఆర్(ఔటర్? రింగురోడ్డు), క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ఫ్లాట్ ఉండకూడదని, ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు, ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయింపు ఉంటుందని మంత్రి పొంగులేటి గతంలో తెలిపారు.

**ఆన్‌లైన్ పోర్టల్, వాట్సప్ ద్వారా దరఖాస్తు**

క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ఫస్ట్? ఫేజ్?లో 16 నియోజకవర్గాలలో 7680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపనున్నారు. ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి గతంలో తెలిపారు. దరఖాస్తు దారులు ఎలాంటి విష ప్రచారాలను నమ్మవద్దని మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్,వాట్సప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కోరుతున్నారు. దరఖాస్తు సమయంలో రూ.10 వేలు చెల్లింపునకు యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్‌ను మాత్రమే ఉపయోగించాలని, ఒక వేళ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాకపోతే తిరిగి అదే ఖాతాకు ఆ మొత్తం వాపసు అవుతుందన్నారు.

# ఫార్ములా-ఈ కేసు
# కోర్టుకు హాజరుకానున్న కేటీఆర్

ఫార్ములా ఈ కార్ రేస్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఫార్ములా ఈ-కారు రేసు కేసు విచారణలో భాగంగా మాజీ మంత్రి,బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరుకానున్నారు. ఈ కేసులో ట్రయల్ ప్రారంభం కానుండటంతో కోర్టు ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగతంగా హాజరవుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందనేది ప్రధాన ఆరోపణ. క్యాబినెట్ అనుమతి లేకుండానే రూ.55 కోట్ల ప్రభుత్వ నిధులను యూకేకు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్?ఈఓ) సంస్థకు బదిలీ చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఏసీబీ దర్యాప్తు చేపట్టి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే ఈ ఆరోపణలను కేటీఆర్ పూర్తిగా తోసిపుచ్చారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులను తెచ్చిందని విమర్శించారు.

ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రి ఉన్న కేటీఆర్‌ను ప్రధాన నిందితుడిగా (ఏ1) పేర్కొన్నారు. ఈ కేసులో అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ (ఏ2), హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డి (ఏ3) లతో పాటు క్రీడా కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు (ఏ4), ఎఫ్‌ఈఓ ప్రతినిధి అల్బెర్టో లాంగో (ఏ5)లను కూడా నిందితులుగా చేర్చారు.

**జైల్లో పెట్టాలని చూస్తున్నారు**

ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో కేటీఆర్? ఇప్పటికే ఏసీబీ విచారణకు పలుమార్లు హాజరయ్యారు. గతంలో విచారణకు హాజరైన సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ చట్టాలపై ఉన్న గౌరవంతో విచారణకు వెళ్లానని ఆయన వివరించారు. ఒకటే ప్రశ్నను ఏసీబీ అధికారులు తిప్పి తిప్పి అడిగారని, అసలు ఈ కేసులో అవినీతి ఎక్కడ ఉందని అవినీతి నిరోధక శాఖ అధికారులని తానే ప్రశ్నించినట్లుగా కేటీఆర్ చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి గతంలో జైలుకెళ్లినందుకు, తమను కూడా జైల్లో పెట్టాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

**కోర్టు సమన్లు**

ఈ కేసులో ఏ1గా ఉన్న కేటీఆర్‌తో పాటు మిగిలిన నిందితు లకు నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు మే 14న సమన్లు జారీ చేస్తూ జూలై 31న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.



ట్రయల్‌లో ఇది తొలి విచారణ కావడంతో నిందితులంతా తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది.

**న్యాయపరమైన ప్రక్రియ**

గతంలో ఈ కేసులో ఎవరూ అరెస్టు కాకపోవడంతో, రేపటి విచారణలో కోర్టుకు వ్యక్తిగత పూచీకత్తు, పర్సనల్ బాండ్ సమర్పించే ప్రక్రియను నిందితులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

## కృష్ణా, గోదావరి పరవళ్లు



-మొదటిపేజీ తరువాయి

గరిష్ట నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 827.26 అడుగులకు చేరగా నిల్వలు 46.82 టీఎంసీలకు పెరిగాయి. ప్రాజెక్టు నిండాలంటే మరో 168 టీఎంసీల నీరు అవసరం. పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కొనసాగుతుండటంతో కృష్ణా ప్రధాన పాయ నుంచి కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 82,111 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, 1.1లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలుతున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.1 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, 1.11 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలోని ఉజ్జయినీ జలాశయానికి 33,803 క్యూసెక్కుల వరద వస్తుండగా, 31,600 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో పైమూడు జలాశయాలకు దిగువన తెలంగాణలో ఉన్న జూరాల ప్రాజెక్టుకు 94,733 క్యూసెక్కుల వరద పోటెత్తింది. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, 7.66 టీఎంసీల నీటిని నిల్వ చేస్తూ 85,421 క్యూసెక్కుల నీటిని 12 గేట్లు, విద్యుత్ కేంద్రం ద్వారా దిగువ వదులుతున్నారు. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో నిలకడక వరద కొనసాగుతోంది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌లోకి 14,922 క్యూసెక్కుల నీరు చేరుతుండగా..గరిష్ట నిల్వ సామర్థ్యం 105.79 టీఎంసీలకుగాను 36.04 టీఎంసీలకు నిల్వలు చేరాయి. జూరాల నుంచి విడుదల చేస్తున్న వరద శ్రీశైలం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండడంతో నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. దిగువన ఉన్న నాగార్జునసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం 136.99 టీఎంసీల నిల్వలున్నాయి.

**ఎగువ గోదావరిలో....**

మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఎగువ గోదావరిలో క్రమంగా వరద పెరుగుతోంది. దిగువ పరీవాహకంలోని ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తారం వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకల్లో వరద ఉధృతమవుతోంది. గోదావరిపై మహారాష్ట్రలో ఉన్న జైక్వాడి ప్రాజెక్టులోకి 33,328 క్యూసెక్కుల వరద చేరుతుండడంతో గరిష్ట సామర్థ్యం 102.73 టీఎంసీలకు గాను 79.79 టీఎంసీలకు నిల్వలు పెరిగాయి. ఉపనది సింగూరులో వరద ప్రారంభం కాకపోవడంతో రాష్ట్రంలోని సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులకు ఇంకా వరద ప్రారంభం కాలేదు. ఎగువ గోదావరిపై ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 75,432 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో 80.5 టీఎంసీల గరిష్ట సామర్థ్యానికి గానూ 21.51 టీఎంసీలకు నిల్వలు చేరాయి. మరో ఉపనది కడెంపై ఉన్న కడెం ప్రాజెక్టుకు 1.44 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో 4.7 టీఎంసీల గరిష్ట సామర్థ్యానికి గాను 1.91 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 16 గేట్లు ఎత్తడం ద్వారా 1.48 లక్షల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం నుంచి 1.56 లక్షల క్యూసెక్కులు, గోదావరి నుంచి 2.07 లక్షల క్యూసెక్కులు కలిపి మొత్తం 3.63 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 20.18 టీఎంసీల గరిష్ట నిల్వ సామరాథ్యనికి గాను 19.09 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ నంది పంప్‌హౌస్ ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. ప్రాజెక్ట్‌లోని 62 గేట్లలో 15 గేట్లు ఎత్తి 1.57 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. గోదావరి--ప్రాణహిత నదుల సంగమ స్థలం వద్ద నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌లోకి ప్రాణహిత నుంచి 2.12 లక్షల క్యూసెక్కుల వరద రాగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు విడుదల చేస్తున్నారు. ప్రాణహితకు ఇంద్రావతి ప్రవాహం తోడు కావడంతో దిగువన ఉన్న సమ్మక్క బరాజ్‌కు 8.05 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు విడుదల చేస్తున్నారు. సీతమ్మసాగర్ బరాజ్‌కు 3.8 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండంతో వచ్చింది వచ్చినట్టు విడుదల చేస్తున్నారు. ప్రాణహిత, ఇంద్రావతి వరదెత్తిన నేపథ్యంలో శుక్రవారం నాటికి భద్రాచలం వద్ద వరద 10 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశముంది.

## 2034 వరకు నేనే ముఖ్యమంత్రి

-మొదటిపేజీ తరువాయి

చేసి వచ్చిన ఉపాధ్యాయులతో సీఎం మాట్లాడారు. ఈసందర్భంగా ఆయా దేశాల్లో తమ అనుభవాలను ఉపాధ్యాయులు పంచుకున్నారు. అక్కడ అవలంభిస్తున్న విధానాలు, అవి మన రాష్ట్రంలో అందిపుచ్చుకునేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి పన్నెండో తరగతి వరకు విద్యార్థులకు ప్రపంచజ్ఞానం నేర్పాలన్నారు. తాను మిడిల్ క్లాస్ అని తెలిపిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఏం చేస్తారని ఎవరైనా ప్రశ్నిస్తే తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతా అని జవాబు ఇవ్వాలని అందుకు తానే ఉదాహరణ అని అభివర్ణించారు. ఆస్తులు లేకపోవటం వెనకబాటు తనం కాదని విద్య లేకపోవటమే అసలైన వెనకబాటు తనాని కి కారణం అని తాము చేపట్టిన సామాజిక, ఆర్థిక , విద్యా, ఉపాధి, కుల సర్వేలో తేలిందని వివరించారు.

**విద్యార్థుల భవిష్యత్ కోసమే విద్యాశాఖ తీసుకున్నా**

అధికారం, ఓట్లు ఎక్కువగా ఇచ్చే శాఖలపైనే సాధారణంగా అందరికీ మక్కువ ఉంటుందని ఓట్లు రావని తెలిసినా విద్యార్థుల భవిష్యత్తు, సమాజంలో మార్పు కోసమే తాను విద్యా శాఖ తీసుకున్నానని సీఎం పేర్కొన్నారు. ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీ పడాలన్నదే లక్ష్యమన్నారు. అయితే కొందరు విద్యాశాఖకు మంత్రి లేడని త్వరగా ఆ శాఖకు ఓ మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారన్న సీఎం, అయితే ఏ కారణంతో తాను విద్యాశాఖకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. గవర్నమెంట్ స్కూల్స్ లో చేరుతున్న వారి సంఖ్య పెంచినందుకా? లేక విద్యార్థులకు అల్పాహార పథకం తీసుకువచ్చినందుకు రాజీనామా చేయాలా అని మండిపడ్డారు. “ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యతలను నేనే తీసుకుంటా. పిల్లల సమస్యలపై ఉపాధ్యాయసంఘాలు నాతో కొట్లాడాలి. ఐఏఎస్?లను బదిలీ చేయడం చాలా తేలిక, ఉపాధ్యాయులను బదిలీ చేయడం మాత్రం అంత సులభంకాదు. దేశానికి విద్య, వైద్యంలో నాయకత్వాన్ని తెలంగాణ నుంచి ఎందుకు ఇవ్వలేం. మండలాల్లో విద్యాభివృద్ధికి ఏం కావాలో ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు ఇవ్వండి. టీచర్ల సలహాలను తీసుకుని అధికారులు అమలు చేస్తారు” 2034 వరకు తెలంగాణ తానే సీఎంగా ఉంటానన్న రేవంత్ రెడ్డి రానున్న ఐదేళ్లపాటు ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలనికోరారు. ఉపాధ్యాయులు పిల్లల కోసం కష్టపడాలని ఉపాధ్యాయుల సమస్యలను తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని భవిష్యత్తులోనూ వారి సమస్యల పరిష్కారానికి ఎప్పుడు కట్టుబడి ఉంటామన్నారు.


మండల స్థాయిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు మండలం ఒక యూనిట్ గా డిసెంబర్ నాటికి ఉపాధ్యాయ సంఘాలు, ఎంఈఓలు నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఇందుకోసం ఓ వెబ్ సైటని ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఏటా పది నుంచి 15 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని విదేశాలకు పంపి అక్కడి విధానాలను అధ్యయనం చేయిస్తామని సీఎం పేర్కొన్నారు. జర్మనీ, ఫిన్లాండ్ దేశాల్లో ఉపాధ్యాయులు పరిశీలించిన అంశాలు, అక్కడ చేసిన అధ్యయనం విద్యార్థులకు ఉపయోగపడాలని సీఎం ఆకాంక్షించారు. ఇకనుంచి ప్రతి ఏటా పది నుంచి 15 మంది ఉపాధ్యాయులకు ఈ తరహా అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్ల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉండాలని కోరారు.

## సంపాదకీయం

# ఉద్యోగులలో ఎఫర్ట్ రిసెషన్

ముఖ్యంగా యువ ఉద్యోగులు పనిపై తమ దృక్పథాన్ని మార్చుకుంటుండగా, కృత్రిమ మేధస్సు ఉద్యోగ ప్రపంచాన్ని వేగంగా ప్రభావితం చేస్తోంది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా 2026 తాజా అధ్యయనం ప్రకారం భారతీయ సంస్థల్లో 'ఎఫర్ట్ రిసెషన్ అనే కొత్త ధోరణి కనిపిస్తోంది. అంటే ఉద్యోగులు తమ విధుల్లో భాగం కాని అదనపు బాధ్యతలు స్వచ్ఛందంగా తీసుకోవడానికి ఆసక్తి చూపడం తగ్గుతోందని నివేదిక వెల్లడించింది.దేశవ్యాప్తంగా సర్వే చేసిన 380 సంస్థల్లో 240 సంస్థలు (63%), గత ఏడాదితో పోలిస్తే ఉద్యోగుల అదనపు కృషి తగ్గిందని తెలిపాయి. సగటున ఈ తగ్గుదల 5 శాతంగా నమోదైంది. నివేదిక ప్రకారం, ఉద్యోగులు ఎవరూ చెప్పకుండానే ఆలస్యంగా పనిచేయడం, తమ బాధ్యతలకు అతీతంగా సమస్యలను పరిష్కరించడం, స్వచ్ఛందంగా అదనపు బాధ్యతలు స్వీకరించడం వంటి అంశాలనే 'డిస్క్రెషనరీ ఎఫర్ట్'గా నిర్వచించారు. ప్రస్తుతం భారత ఉద్యోగుల్లో జెన్ జీవాటా 26 శాతానికి చేరుకుంది. ఇది 2023తో పోలిస్తే దాదాపు రెండింతలు. ఈ తరం ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయడం కంటే పని-వ్యక్తిగత జీవితం సమతుల్యత, అనువైన పని విధానం, నిరంతర నైపుణ్యాభివృద్ధి, కెరీర్ పురోగతి, అర్థవంతమైన పని, మానసిక ఆరోగ్యం వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అధ్యయనం పేర్కొంది. అదే సమయంలో ఏఐ ప్రభావంతో ఉత్పాదకతను కొలిచే విధానంలో కూడా మార్పులు వస్తున్నాయి. అయితే తాజా నివేదిక ప్రకారం ఉద్యోగుల అదనపు కృషి తగ్గుదల అన్ని రంగాల్లో ఒకేలా ఉండటం లేదు.రిటైల్ రంగంలో 88%, ఐటీ మరియు ప్రొఫెషనల్ సర్వీసెస్‌లో 77%, నిర్మాణం, రియల్ ఎస్టేట్‌లో 71%తయారీ (మాన్యుఫ్యాక్చరింగ్)లో కేవలం 44% తగ్గుదల నమోదైందని తెలిపాయి.ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది. అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది.ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది. అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది.దట్ కల్చర్ థింగ్ సంస్థకు చెందిన ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్ గుర్లీన్ బరువా అభిప్రాయం ప్రకారం ఇది పని పట్ల నిబద్ధత తగ్గిపోవడం కాదని, పనిని చూసే విధానం మారుతున్న సంకేతమని పేర్కొన్నారు. పని పట్ల నిబద్ధత అంటే కేవలం ఎక్కువ గంటలు పనిచేయడం లేదా ఎప్పుడూ బిజీగా కనిపించడం మాత్రమే కాదు. సమస్యలను సమర్థంగా పరిష్కరిం చడం, నాణ్యమైన ఫలితాలు ఇవ్వడం, బృందంతో సమన్వయంగా పనిచేయడం కూడా నిజమైన వర్క్ ఎథిక్‌లో భాగమే అని ఆమె చెప్పారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఏఐ కారణంగా ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ముఖ్యంగా ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో గంటల కొద్దీ పనిచేయడం కంటే సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతికతను సమర్థంగా వినియోగించడం కీలకంగా మారుతోంది. అలాగే వర్క్ ఫ్రం హోమ్, హైబ్రిడ్ వర్క్, మానసిక ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహన కారణంగా ఉద్యోగులు తమ వ్యక్తిగత సమయానికి ఎక్కువ విలువ ఇస్తున్నారు. నేటి ఉద్యోగులు అదనపు కృషి చేయడానికి సిద్ధంగానే ఉన్నప్పటికీ, ఆ కృషికి స్పష్టమైన ఉద్దేశం, గుర్తింపు, విశ్వాసం, అర్థవంతమైన పని ఉంటేనే ముందుకు వస్తున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అధిక సీట్లు.. ప్రజాస్వామ్యానికి తూట్లు!



కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనకు కసరత్తు చేస్తున్నది. 543 లోక్‌సభ సీట్లను 824-850కి పెంచుతామని చెప్తున్నది. కానీ లోక్‌సభ సీట్లను పెద్దఎత్తున పెంచడం వల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచి ఉన్నదని అనిపిస్తున్నది. ఎందుకంటే అత్యధిక సభ్యులు ఉంటే కేవలం ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఉంటుంది, అంతేకానీ తమ గొంతు వినిపించేందుకు అవకాశం ఉండదు. అంతేకాకుండా దేశంలోని సంస్థాగత నిర్మాణాన్ని ధ్వంసం చేసే దిశగా మలుపు తిప్పే సూచనగా నిలుస్తుంది.

కేంద్ర ప్రభుత్వం చెప్తున్న డీలిమిటేషన్ లెక్కలు కేవలం అంకెల కోణానికి మాత్రమే పరిమితం. 1972లో పార్లమెంట్‌లోని దిగువసభ అయిన లోక్‌సభ స్థానాలను 543గా ఖరారు చేశారు. అయితే, ఆ సంఖ్య అలాగే యథాతథంగా ఉండిపోవాల్సిన అవసరం ఏమీ లేదు. కానీ ఆ పెరుగుదల అనేది ప్రజాస్వామ్య మౌలిక లక్ష్యాలకు విఘాతం కలిగించేదిగా ఉండకూడదు. కానీ కేంద్రం చెప్తున్న పద్ధతిలో సీట్ల సంఖ్యను పెంచడంలో ఓ పెనుప్రమాదం దాగి ఉన్నది. కేంద్రం తలపెట్టిన డీలిమిటేషన్ ప్రక్రియ చాలా ప్రధానమైన ఆటంకాల మధ్య నిలిచిపోయింది. మరోవైపు వివిధ ఆటంకాలు ఉండగానే, జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచుతామని కేంద్రం చెప్తూ వస్తున్నది.

అంటే జనాభా నియంత్రణలో సత్ఫలితాలు సాధించిన దక్షిణాది రాష్ర్టాలను శిక్షించనట్టు, హిందీ ప్రాబల్యం కలిగిన ఉత్తరాది రాష్ర్టాలకు బహుమతి ఇచ్చినట్టు అవుతుంది. ఇదొక కీలకమైన అభ్యంతరం. కానీ కేంద్రం పరిష్కారం చూపని సమస్యగా మిగిలిపోయింది. దీంతో సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా పునర్విభజన జరగడానికి వీల్లేదనే వాదనలు, రాజకీయ డిమాండ్లు, సంక్లిష్ట పరిస్థితుల మధ్య పునర్విభజన వ్యవహారం ముందుకు సాగలేదు. ఇంతటి క్లిష్ట పరిస్థితుల మధ్య నిర్వహించడానికి కూడా కష్టంగా ఉండే నిర్మాణంలో భారీ లోక్‌సభ అవసరమేంటి? ఏ స్థిరమైన ప్రజాస్వామ్య దేశంలోనూ ఇలాంటి ప్రతిపాదిత వ్యవస్థ లేదు.

పరిణతి చెందిన ప్రతి ప్రజాస్వామిక వ్యవస్థ పరిశీలన, సమగ్ర చర్చ, సభ్యులందరి భాగస్వామ్యాన్ని కోరుకుంటుంది. అలాంటి వీలు కల్పించే విధంగా సభ పరిమాణాన్ని పరిమితం చేయాలని కోరుకుంటుంది. ఎక్కడా లేని విధంగా లోక్‌సభలో సభ్యుల సంఖ్యను 850కి పెంచాలని నిర్ణయించడం, అసాధారణం, ప్రమాదకర మార్గంలో ప్రయాణించడమే అవుతుంది. ప్రజాస్వామ్య సిద్ధాంతం, ప్రపంచ వ్యాప్తంగా ఆచరణను గమనిస్తే ఒక విషయం స్పష్టమవుతున్నది. సభ్యుల సంఖ్య ఒక పరిమితిని దాటిన తర్వాత అది ఆలోచనాత్మక వేదికగా కాకుండా అస్తవ్యస్తమైన సభగా మారుతుంది. అలాంటి చోట కొందరికి మాత్రమే మాట్లాడే అవకాశం ఉంటుంది. మిగిలిన సభ్యులు కేవలం ఓటింగ్ కోసం, ఏమీ చేయలేని ప్రేక్షకులుగా మిగిలిపోతారు. అమెరికా ప్రతినిధుల సభ సభ్యుల సంఖ్యను 1929లో 435గా నిర్ణయించారు. అప్పుడు ఆ దేశం జనాభా 12 కోట్లు ఉండగా, ప్రస్తుతం 33.5 కోట్లుగా ఉన్నది. కానీ నేటికీ అమెరికాలోని ప్రతినిధుల సభలో సభ్యుల సంఖ్య 435గానే కొనసాగుతున్నది. జనాభా పెరిగిన నిష్పత్తిలోనే సభ్యుల సంఖ్యను పెంచితే సభా కార్యకలాపాలు స్తంభించిపోతాయని అమెరికన్లు భావిస్తుంటారు. నియోజకవర్గ పరిధిలో జనాభా పెరుగుతుంది, కానీ ప్రతినిధి మాత్రం ఒక్కరే ఉంటారు.

ఏటేటా పార్లమెంట్ సమావేశాలు జరిగే రోజుల సంఖ్య తగ్గిపోతున్నది. స్థాయీ సంఘాలు పరిశీలన లేకుండానే మూజువాణి ఓటుతో బిల్లులు ఆమోదం పొందుతున్నాయి. ప్రతిపక్షం పాత్రను పాలకపక్షం తోసిపుచ్చుతున్నది. సభను ఇంకా వందలాది మంది సభ్యులతో నింపితే సభ్యుల పట్ల అణచివేత మరింత పెరుగుతుంది. సంఖ్యా బలం కింద నాణ్యత మరుగునపడిపోతుంది.

ఎక్కువ మందికి ప్రాతినిధ్యం వహించే క్రమంలో పాలనలో అంతరాలు ఏర్పడకుండా పెద్దఎత్తున స్థానిక సిబ్బందిని పెంచుతుంటారు. ఆధునిక సమాచార వ్యవస్థ, అత్యంత పకడ్బందీగా నిర్వహించే కమిటీ వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. ఇదే తరహాలో భారత్‌లోని ఎంపీలు కూడా చేయవచ్చు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నట్టుగా లోక్‌సభ సభ్యుల సంఖ్యను 850కి పెంచితే, ఎంపీలకు వినాశకరమైన పరిస్థితులు ఏర్పడవచ్చు. పార్లమెంట్ సమావేశాల్లో సమయం చాలా పరిమితమైంది. ఉదాహరణకు రోజువారీ ప్రశ్నోత్తరాలు లేదా ఏదైనా సంక్లిష్ట బిల్లుపై సమగ్ర చర్చ జరగాలంటే కనీసం నాలుగు గంటలు కేటాయిస్తే, 850 మంది సభ్యుల్లో ఎంత మందికి అవకాశం ఇవ్వగలుగుతారు? పార్టీల బలాలను బట్టి సమయం కేటాయిస్తే, మొత్తం 15-20 మంది మాత్రమే చర్చలో పాల్గొనగలరు. పార్టీలలో వెనుక వరుసలోని సభ్యులు, చిన్నపార్టీల సభ్యులు కేవలం ప్రేక్షకపాత్రకు పరిమితమవుతారు. అత్యధిక సభ్యులున్న పెద్ద సభలో పాలక పక్షాన్ని ప్రశ్నలు అడిగేందుకు, ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టేందుకు, ఐదేండ్ల పదవీ కాలంలో కనీసం ఒక్క అర్థవంతమైన చర్చలోనైనా పాల్గొనేందుకు చాలామంది సభ్యులకు అవకాశం దొరకదు. కేవలం వారి పార్టీల నేతలు ఆదేశించినప్పుడు చేతులెత్తడానికి తప్ప ఏమీ ఉపయోగం ఉండదు.

ఇప్పటికే పరిపాలనలో ఈ ధోరణి ఆందోళనకరంగా ఉన్నది. సభ్యుల సంఖ్య భారీగా పెరిగితే పరిస్థితి మరింత దుర్భరంగా మారుతుంది. ఇటీవలి సంవత్సరాల్లో పరిపాలనలో పార్లమెంట్ పాత్ర క్రమంగా క్షీణిస్తున్నది. ఏటేటా పార్లమెంట్ సమావేశాలు జరిగే రోజుల సంఖ్య తగ్గిపోతున్నది. స్థాయీ సంఘాలు పరిశీలన లేకుండానే మూజువాణి ఓటుతో బిల్లులు ఆమోదం పొందుతున్నాయి. ప్రతిపక్షం పాత్రను పాలకపక్షం తోసిపుచ్చుతున్నది. సభను ఇంకా వందలాది మంది సభ్యులతో నింపితే సభ్యుల పట్ల అణచివేత మరింత పెరుగుతుంది. సంఖ్యా బలం కింద నాణ్యత మరుగునపడిపోతుంది. భారీ సంఖ్యలో సభ్యులు కలిగిన సభలో ఏదైనా చర్చించేందుకు అనుకూల వాతావరణం ఉండదు. చర్చించడానికి వీలులేనంత పెద్ద సభ సహజంగానే తన పర్యవేక్షణ అధికారాన్ని కోల్పోతుంది. మంత్రివర్గమే పర్యవేక్షణ బాధ్యతను చూసుకోవాల్సి వస్తుంది. సభ్యులు తమ బలాన్ని కోల్పోతారు. సభ నోటీసు బోర్డుగా, రబ్బర్ స్టాంప్‌గా మారిపోతుంది.

ఒకవేళ లోక్‌సభ స్థానాలను 850కి పెంచితే అ ది, చైనా పీపుల్స్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ లేదా ఉత్తర కొరియాలోని సుప్రీం పీపుల్స్ అసెంబ్లీని పోలి ఉం టుంది. ఆయా దేశాల సభలు చూడటానికి గంభీరంగా, పెద్ద ఎత్తున ప్రతినిధులు కలిగిన సభలుగా కనిపిస్తాయి. కానీ చివరికి అధినేతలు ముందే సిద్ధం చేసుకొని ఇచ్చిన ప్రసంగాలకు చప్పట్లు కొట్టేందుకే సభ్యులు పరిమితమవుతారు. ఆ రెండు దేశాల సభల్లోని సభ్యులు తమ అంగీకారం తెలిపేందుకు మాత్రమే ఉన్నారు. అంతేకానీ చర్చలో పాల్గొని, అభిప్రాయాలు తెలిపేందుకు కాదు. భారతదేశంలో ఎంపీల గొంతులు నొక్కేలా భారీ లోక్‌సభను నిర్మిస్తే, ప్రజాస్వామ్యాన్ని నిర్వీ ర్యం చేసినట్టే అవుతుంది. చర్చ స్థానంలో ప్రదర్శనను నిర్వహించినట్టు మారుతుంది. మరో 300 మంది ఎంపీలను పెంచితే వారి జీతం, వసతి, ప్రయాణ, పెన్షన్‌కు అదనపు వ్యయం అవుతుంది. ఆ ఖర్చును ఆదా చేసి, పార్లమెంట్ సమీపంలో ఎంపీలకు పటిష్ట కార్యాలయం నిర్మించవచ్చు.

కేంద్ర ప్రభుత్వం చెప్తున్నట్టుగా ఒక ఎంపీ 20-30 లక్షల మందికి ప్రాతినిధ్యం వహించలేరన్న వాదన తప్పు, అపోహ. చట్టాల రూపకల్పన, విదేశాంగ విధానం, స్థూల ఆర్థిక పాలన, కేంద్ర కార్యనిర్వాహకవర్గాన్ని జవాబుదారీగా ఉంచడం ఎంపీల రాజ్యాంగ విధి. వాళ్లు మున్సిపల్ కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు కాదు. ఇప్పుడున్న తరహాలోనే పెద్ద నియోజకవర్గాలకు ఎంపీలు ప్రాతినిధ్యం వహించగలరు.

73, 74వ రాజ్యాంగ సవరణల ప్రకారం స్థాని క సమస్యలు, స్థానిక సంస్థలు, పట్టణ మౌలిక సదుపాయాలు పూర్తిగా రాష్ర్టాల అసెంబ్లీ, మున్సి ల్ కౌన్సిల్, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎమ్మెల్యేల సంఖ్యను పెంచాలి. పౌరులు రోజువారీ సమస్యల పరిష్కారం కోసం ఎంపీ వైపు చూడాల్సిన అవసరంలేదు. ఎంపీలు పూర్తిగా జాతీయ పరిపాలన అంశాలపై దృష్టి పెట్టి, స్థానిక అంశాలను అసెంబ్లీ, మున్సిపల్‌శాఖ, గ్రామపంచాయతీలకు వదిలేయాలి. దీంతో పార్లమెంట్ పనితీరుకు ఆటంకం కలుగకుండా భారత్ సమర్థవంతమైన, ప్రభావవంతమైన, భాగస్వామ్యంతో కూడిన సమాఖ్య నిర్మాణాన్ని కొనసాగించగలదు. సభలో జరిగే చర్చల్లో పాల్గొనేందుకు సభ్యులకు అవకాశం, స్థానిక సంస్థలకు సాధికారత కల్పించడంలో ప్రజాస్వామ్య భవిష్యత్తు ఉంటుంది, అంతేకానీ చర్చల స్థానంలో డొల్ల నాటకాలను ప్రదర్శించే భారీ మహాసభను నిర్మించడంలో కాదు.

# ప్రకృతి చేస్తున్న హెచ్చరిక



వర్తమానంలో లాభార్జన కోసం భవిష్యత్తును బలిపెట్టే నయా ఉదారవాద విధానాలు ప్రపంచాన్ని ప్రమాదపుటంచులకు తీసుకెళ్తున్నాయి. దశాబ్దాలుగా యూరప్, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆసియా, ఆస్ట్రేలియాల్లో చోటుచేసుకుంటున్న కార్చిచ్చుల్ని పట్టించుకుని పర్యావరణ అనుకూల విధానాలు పాటించని ఫలితంగా ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 37 కోట్ల ఎకరాల్లోని అడవులు, పొదలు తగలబడ్డాయని ఒక అంచనా. ఇలా కార్చిచ్చులో చిక్కుకున్న ప్రాంతం మంగోలియా దేశ విస్తీర్ణానికి సమానమని చెబుతున్నారు. స్పెయిన్, ఫ్రాన్స్ అటవీప్రాంతాల్లో, కెనడా, రష్యాల్లో గత వారం రోజు లుగా వ్యాపిస్తున్న మంటల వల్ల ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ఫ్రాన్స్, స్పెయిన్ కార్చిచ్చులైతే ఊహించశక్యం కానంత స్థాయిలో ఉన్నాయి. వాటిని అదుపు చేయగలిగా మని ఆ రెండు దేశాలూ చెబుతున్నా జనంలో భయాందోళనలు ఉపశమించలేదు. నైరుతి ఫ్రాన్స్‌లో పారిస్‌కు నాలుగు రెట్లు పెద్దదైన విస్తీర్ణంలోని అడవి తగలబడటంవల్లగిరోండ్ ప్రాంతంలోని జనావాసాలనుంచి రెండున్నర లక్షలమంది పౌరుల్ని ఆదరా బాదరాగా తరలించాల్సివచ్చింది.

ముఖ్యంగా బోర్డావ్ నగరంవైపు ఆ మంటలు వ్యాపిస్తున్న తీరు జనాన్ని హడలెత్తించింది. అటు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ లక్షమందిని తరలించారు. దాని శివారు ప్రాంతాల్లో పలు జనావాసాలు తగలబడిపోయాయి. ఆ రెండూ యుద్ధ రంగాన్ని తలపింపజేస్తున్నాయని మీడియా కథనం. జరగాల్సిన నష్టం జరిగాక మంటల్ని ఏదోమేరకు అదుపు చేయటం సాధ్యమే. కానీ వాటివల్ల వ్యాపించే పొగవల్ల గాలి నాణ్యత దెబ్బతింటుంది. కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లతో కూడిన సూక్ష్మ ధూళి కణాలు పీల్చేగాలిలో వ్యాపించి ఊపిరి తిత్తులు, గుండెసంబంధ వ్యాధులతో ప్రజారోగ్యం క్షీణిస్తుంది. అరుదైన వృక్షసంపద, జీవవైవిధ్యం బుగ్గిపాలవుతుంది. దాని కారణంగా వడగాడ్పులు చెలరేగి జనంఅల్లాడిపోతారు. ఈ ఖండాల్లో ఏటా కార్చిచ్చులవల్ల 3,40,000 అకాల మరణాలుసంభ విస్తున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి. 2023లో ప్రపంచ కర్బన ఉద్గారాల్లో కెనడా కార్చిచ్చుల వాటా 23 శాతమని అంచనా వేశారు. యూరప్ ఖండం అత్యంత వేగంగా వేడెక్కుతున్నదని యూరోపియన్ యూనియన్(ఈయూ) పర్యవేక్షణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఫ్రాన్స్ కార్చిచ్చువల్ల ఆస్ట్రేలియా, అమెరికా, కెనడాల్లోని పలు ప్రాంతాల్లో పొగ, ధూళితో కూడిన నీటియావిరి వ్యాపించి, అది మేఘాలుగా మారి, ప్రమాదకరమైన పెనుగాలులు, పిడుగుపాట్లు సంభవించాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సాధారణంగా ఇలాంటి కార్చిచ్చులు మానవతప్పిదాలతోనే మొదలవుతాయి. కానీ వాతావరణ మార్పుల పర్యవసానంగా అవి వేగంగా విస్తరిస్తాయి. ఈ విషయంలో శాస్త్రవేత్తలు స్థూలంగా అంగీకారానికొచ్చినా, తమ నమూనాలు అందుకోలేనంత స్థాయిలో ఇవి ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ తీవ్రతను పసిగట్టడానికి కొత్త ఉపకరణాలు అవసరం కావొచ్చన్నది వారి అభిప్రాయం. ఇప్పుడు స్పెయిన్, ఫ్రాన్సుల్లో మంటలు వ్యాపించిన అడవుల్లో పిక్నిక్‌లు, క్యాంప్ ఫైర్లు ఎక్కువ. అజాగ్రత్తగా ఉండే మనుషులవల్ల నిప్పు రాజుకోవటం, గాలిలో తేమ శాతం తక్కువుండే రాత్రివేళ మోడువారిన చెట్లు, ఎండుటాకులు అంటుకుని మంటలు వేగంగా వ్యాపించడం రివాజు.

గత కొన్నేళ్లుగా ఈ కార్చిచ్చులవల్ల ఉత్పత్తయ్యే వేడి, పొగ ఆధారంగా పైరోక్యుములో నింబస్ మేఘాలు ఏర్పడి వర్షరహిత పెనుగాలులతో కూడిన తుపానులు ఏర్పడుతున్నాయి. తీవ్రమైన ఆ వేడిగాలుల కారణంగా ఎక్కడెక్కడో పడే పిడుగులు మరిన్ని అగ్నిప్రమాదాలకూ, కార్చిచ్చులకూ దారితీస్తున్నాయి. విషపూరిత పొగ, బొగ్గు రేణువులతో ఉండే ఈ మేఘాలు అణు విస్ఫోటంలో వచ్చే పొగ మాదిరే దీర్ఘకాలం వాతావరణంలో అలుముకుని సూర్యరశ్మిని అడ్డుకుంటాయి. 2019--20లో ఆస్ట్రేలియా ఇలాంటి వాతావరణాన్ని చవిచూసింది. దానికి 'బ్లాక్ సమ్మర్' అని పేరుపెట్టారు. ఇకనైనా వాతావరణంతో ఆటలాడటం ప్రమాదకరమని ప్రభుత్వాలు గుర్తించాలి. గుప్పెడు కార్పొరేట్ సంస్థల లాభార్జన కోసం వాతావరణాన్ని బలిపెడితే ఊహకందని ఉత్పాతాలు కాటేస్తాయి. పర్యావరణం ధ్వంసమై మానవాళి మనుగడే పెను ప్రమాదంలో పడుతుంది. తాజా పరిణామాలు చేస్తున్న హెచ్చరిక ఇదే.

# జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
**రెడ్ అలర్ట్ నేపథ్యంలో వచ్చే 24 గంటలు అత్యంత కీలకం.**
**ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.**
**చెరువులు, గోదావరి పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలి.**
**ముంపుకు గురైన కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని వసతులు కల్పించాలి.**
**జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**అగ్నిధార న్యూస్ మంథని :**

గత 48 గంటలుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ నేపథ్యంలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు.గురువారం ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ లతో కలిసి భారీ వర్షాల పరిస్థితిపై జిల్లా అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ**

:- జిల్లాలోని ఒక్క చెరువు కూడా గండి పడకుండా లేదా తెగిపోకుండా సాగునీటి శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా సాగునీటి శాఖ అధికారి ఆధ్వర్యంలో లస్కర్లు, సహాయ ఇంజినీర్లు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పూర్తి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) చెరువులను పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలతో కలిసి నిరంతరం పరిశీలించాలని సూచించారు. చెరువుల్లో గండ్లు, నీటి పొంగిపొర్లడం లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నీట మునిగిన కాజ్‌వేలు, లోతట్టు రహదారులను వెంటనే రాకపోకలకు మూసివేయాలని, అలాంటి ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు, పోలీసు సిబ్బందిని మోహరించి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.



రానున్న 24 గంటల పాటు అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి :మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వర్షాల వల్ల దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లను వెంటనే గుర్తించి అత్యవసర మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తహసీల్దార్లు వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పశువుల నష్టం వంటి ఘటనలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిహార ప్రతిపాదనలు సిద్ధం చేసి ట్రెజరీకి పంపించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లు తదితర స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.నీట మునిగిన ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి, అక్కడ ఆహారం, తాగునీరు, వసతి, తదితర అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లను వెంటనే గుర్తించి వాటిలో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) అధికారులు విద్యుత్ సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి, దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థలను అత్యవసరంగా పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు.గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు, సరిహద్దు మండలాలు, గ్రామాల్లో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని, చేపల వేట, పశువులను మేపడం లేదా ఇతర ప్రమాదకర కార్యకలాపాల కోసం ఎవరూ నదిలోకి వెళ్లకుండా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.వర్షాల కారణంగా దెబ్బతిన్న లేదా రాకపోకలకు అంతరాయం కలిగిన రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఏవైనా అత్యవసర సంఘటనలు జరిగిన వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం

**: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.**
**ఆర్అండ్ఆర్ కాలనీలోకి వరద నీరు చేరకుండా ఆర్ఎఫ్‌సీఎల్ తక్షణ చర్యలు చేపట్టాలి.**
**ఓసీ-3 ప్రాంతంలో యంత్రాలతో నీటిని వేగంగా తొలగించాలి.**
**రామగుండం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే కలెక్టర్**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూలై-30:**

రామగుండం మున్సిపల్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.గురువారం రామగుండం మున్సిపల్ పరిధిలోని 21వ డివిజన్ వీర్లపల్లి, ఓ.సి.పి - 3 ఏరియా,25వ డివిజన్ వరద ప్రభావిత ప్రాంతాలను రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్ రామగుండం అరుణ శ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద పరిస్థితులను, నీటి నిల్వను, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ...... ఆర్అండ్ఆర్ కాలనీలో వరదల సమయంలో



నీరు ఇళ్లలోకి ప్రవేశించకుండా ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలను రూపొందించాలని ఆదేశించారు.

ఓసీ-3 ప్రాంతంలో నిలిచిపోయిన వరద నీటిని యంత్రాల సహాయంతో అత్యంత వేగంగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి నిల్వల వల్ల ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, అవసరమైనచోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఆర్ఎఫ్‌సీఎల్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విలోచవరం నుండి మంథనికి నిలిచిపోయిన రాకపోకలు



**అగ్నిధార న్యూస్ మంథని :**

మంథని మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మంథని మండలంలోని విలోచవరం వాగు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తోంది. వాగు ఉద్ధృతి ఒక్కసారిగా పెరగడంతో రహదారిపైకి భారీగా వరద నీరు చేరుకొని, మంథనికి వెళ్లే సాధారణ వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

## పెద్దపల్లి జిల్లాలో భారీ వర్షాలపై అత్యవసర సమావేశం

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం**
**మంత్రి శ్రీధర్ బాబు**

**అగ్నిధార న్యూస్ పెద్దపల్లి/మంథని :**



భారీ వర్షాల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలో వాస్తవ పరిస్థితులపై ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి శ్రీధర్ బాబు గురువారం అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్తు కార్యాచరణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## వర్షాలకు కూలిన ఇంటి గోడ...




**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

కమాన్‌పూర్ మండల పరిధిలోని పేరపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల సంధ్యారాణి ఇంటి గోడ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బొంగోని సదయ్య, ఉప అశోక్, పంచాయతీ సిబ్బందితో కలిసి కూలిపోయిన ఇల్లును పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందేలా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంగోని సదయ్య మాట్లాడుతూ.. వర్షాల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థకు చేరిన పాత గోడలు, ఇళ్ల వద్ద ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## మహమ్మదాబాద్ టీయూడబ్ల్యూజే మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) మహమ్మదాబాద్ మండల కార్యవర్గ సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా కొత్త గోపాల్, ప్రధాన కార్యదర్శిగా రవి, ఉపాధ్యక్షులుగా డి. వెంకటేష్,డి. అంజిలయ్య, కార్యవర్గ సభ్యులు జే.వీరాజీ, మల్కయ్య, మహేందర్, హనుమంతు, రమేష్, కేశవులు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జర్నలిస్టులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

## గండీడ్ టీయూడబ్ల్యూజే మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**అగ్నిధార న్యూస్ గండీడ్:**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) గండీడ్ మండల కార్యవర్గ సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా గోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి, వెంకటేష్, కార్యవర్గ సభ్యులు శంకర్, బద్రి, యాదగిరి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జర్నలిస్టులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.



## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట ఎమ్మెల్యే


**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



ప్రజలకు అందించే మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీ పడకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తల్ ప్రజలకు అందించే మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీ పడకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీవో సుజాత అధ్యక్షతన నిర్వహించిన మండల సభలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మండల ప్రత్యేక అధికారి పాల్గొని వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ఆయా శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ పనుల పై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యతకు పెద్దపీట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి డిసిసిబి చైర్మన్ గంప వెంకటేష్,సర్పంచ్ బిక్షపతి,తది తరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబనికి అండగా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాపా నిఖిల్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



ఊర్కొండ.మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలే గణేష్ మరియు ఉపసర్పంచ్ పోలే రాజు మాతృమూర్తి ఇటీవలే ప్రమాదవశాత్తు మరణించిన పోలే లక్ష్మమ్మ కుటుంబాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాదారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల మాజీ కార్యని ర్వాహక అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అయూబ్ పాషా, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆది, కాంగ్రెస్ నాయకులు ఖాజా వహిదొద్దీన్ , దారా రాజు, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిని సన్మానించిన టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమితులైన ఆసిఫ్ అలీ హైదరాబాదులోనీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సీఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి నీ ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది ఈ సందర్భంగా ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, స్థానిక సంస్థల బలోపేతం వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఫైనాన్స్ కమిషన్ సభ్యుడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్ తదితరులు ఉన్నారు.

## తుపాన్ వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పడకల్ గ్రామ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పడకల్ గ్రామ ప్రజలకు సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,మబ్బులు పట్టి వర్ష తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని ఆమె విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరియు పాతబడిన, బలహీనమైన ఇళ్లలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇళ్లు కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉంటే వెంటనే సురక్షితమైన వేరే ప్రాంతాలకు లేదా వేరే ఇళ్ల కు మారాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అనవసర ప్రయాణాలు చేయవద్దని, పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు మరియు రోడ్లపై ప్రవహిస్తున్న ఉధృతమైన నీటిని దాటే ప్రయత్నం ఎవరూ చేయవద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. బాధితులకు అవసరమైన సహాయక చర్యలను అధికారులు అందించాలని ఈ సందర్భంగా సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి కోరారు..

# భక్తిశ్రద్ధల మధ్య శ్రీకృష్ణ కాలచక్రం విశ్వశాంతి మహాయాగం

**లక్ష దీపోత్సవంలో పాల్గొన్న అశేష ప్రజానీకం**

**నిర్వాహకులు జూలూరి రమేష్ బాబు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



కల్వకుర్తిలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం 91 వ విశ్వ శాంతి మహా యాగ 12 వ రోజు మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి దివ్య మంగళ శాసనాల మేరకు నిర్వహిస్తున్న ఆయుధ చండీ, అతిరుద్ర మహాయాగంలో భాగంగా పలు విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు శ్రీ లక్ష్మీ హోమములు ప్రత్యేక త దేవి సూక్త హోమములు శ్రీ లక్ష్మీనారాయణ సుదర్శన హోమములు వ్రతములు నిర్వహించడం జరిగింది. ఈ హోమము లో పాల్గొని శివునికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అని నిర్వాహకులు జూలూరి రమేష్ బాబు అన్నారు. ప్రత్యేక పూజలు, హోమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు శ్రీకృష్ణ కాలచక్ర యంత్ర లక్ష్య దీపోత్సవం నిర్వహించడం జరిగింది ఈ దీపోత్సవం కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని విశ్వశాంతి, లోకక్షేమం, కుటుంబ సౌభాగ్యం కోసం ప్రార్థనలు చేశారు. ఈ మహాయాగ మహోత్సవాలు మరికొన్ని రోజుల పాటు కొనసాగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో, ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకులు జూలూరి రమేష్ బాబు, రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ, పాపి శెట్టి శ్రీనివాసులు, గోవిందు కృష్ణయ్య, మనోహర్, రామస్వామి, దారమోని గణేష్, సురేష్, ఆర్య వైశ్య సంఘం నాయకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఉద్యోగం పొందిన యువతతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తుక్కుగూడ ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్ ఇంటర్వ్యూ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సీఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, నైపుణ్యాలను పెంపొందించుకుని ప్రతి ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించడం, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడం లక్ష్యంగా ఇలాంటి జాబ్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. యువతకు ఉద్యోగం కుటుంబానికి భరోసా సమాజానికి అభివృద్ధి అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూ కు కల్వకుర్తి మండలం నుండి 07 గురు ఆమనగల్ మండలం నుండి 4 గురు, తలకొండపల్లి మండలం నుండి 5 గురు , కడ్తాల్ మండలం నుండి 5 గురు నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 21 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతి నిధులు వీర, శ్రీనివాస్, మరియు ఐక్యత పౌండేషన్ సభ్యులు , నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# డల్లాస్‌లో అంబరాన్నంటిన బీఆర్ఎస్ మీట్ గ్రీట్' వేడుక

**పాల్గొన్న సర్పంచుల సంఘం**

**రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహా రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



అమెరికాలోని డల్లాస్ నగరంలో బి ఆర్ ఎస్ పార్టీ డల్లాస్ విభాగం ఆధ్వర్యంలో, ప్రవాస తెలంగాణవాదులు మంగళవారం ప్రత్యేకంగా 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు వి. ప్రకాష్ , విప్లవ గేయకుడు మిట్టపల్లి సురేందర్ మరియు రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో సాగిన మలిదశ ఉద్యమ జ్ఞాపకాలను, నాటి చారిత్రక ఘట్టాలను, పది సంవత్సరాలలో తెలంగాణ సాధించిన ప్రగతిని గుర్తు చేసుకున్నట్లు తెలిపారు. వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేయడంలో, తెలంగాణ కోటి ఎకరాల మాగాణిగా మారడంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పోషించిన కీలక పాత్రను, దాని ప్రాముఖ్యతను ప్రకాశ్ వివరించినట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకలైన బతుకమ్మ, బోనాల పండుగలను ప్రపంచవ్యాప్తంగా ఘనంగా చాటిచెప్పడంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వ కృషిని మిట్టపల్లి సురేందర్ తన పాటలతో ఉర్రూతలూగించారని తెలిపారు. కేసీఆర్ దార్శనిక పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో సాధించిన అపూర్వ ప్రగతిని ప్రవాస తెలంగాణ వాదులు కొనియాడినట్లు తెలియజేసారు. అదేవిధంగా ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితులను, ప్రభుత్వ వైఫల్యాలను వారికి వివరించారు. రాబోయే రోజుల్లో బి ఆర్ ఎస్ పార్టీని మరింత పటిష్టం చేసి, తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రవాస తెలంగాణవాదులు సైతం ఐక్యంగా కలిసికట్టుగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డల్లాస్ నగరానికి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు సత్య యాదగిరి, శ్రీనివాస్ సురభి, హరి, లక్ష్మ గూడూరు, రాము మారగొని, సుభాష్ కట్టెగుమ్మల, పెద్ద సంఖ్యలో ప్రవాస తెలంగాణ వాసులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారానికి జూలపల్లి గ్రామ ప్రజల ఐక్యత

**సర్పంచ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం పాదయాత్ర విజయవంతం**

**భూ సమస్యలు, బీటీ రహదారి నిర్మాణంపై వినతిపత్రం**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**






తలకొండపల్లి, మండలంలోని జూలపల్లి గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థులు ఐక్యంగా ముందుకొచ్చి గురువారం నిర్వహించిన ఛలో ఎంపీడీవో కార్యాలయం పాదయాత్ర విజయవంతంగా సాగింది. జూలపల్లి గ్రామం నుంచి తలకొండపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వరకు చేపట్టిన ఈ పాదయాత్రలో సుమారు 100 మంది గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని గ్రామ సమస్యలపై తమ గళాన్ని వినిపించారు. గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్, వార్డు సభ్యులు వి. సుమిత్ర--రాఘవేందర్ ముదిరాజ్, బి. శోభ--అశోక్ ముదిరాజ్, జి. అల్లాజీ గౌడ్, జి. జగదీశ్ గౌడ్, పాత్లావత్ ఉనెమ్మ--లస్కర్ తదితరులు ప్రజలతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్ర అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తలకొండపల్లి ఎంపీడీఓ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో సర్వే నంబర్లు 150, 155, 159, 160, 161, 162, 195, 196, 203 తదితర భూములకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే జూలపల్లి--గట్టిఇప్పలపల్లి గ్రామాలను కలిపే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో రైతులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వర్షాకాలంలో ప్రమాదాల ముప్పు అధికంగా ఉన్నందున ఈ రహదారిని అత్యవసరంగా నూతన బీటీ రహదారిగా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీడీఓ అధికారులు గ్రామ సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు గ్రామ నాయకులు తెలిపారు. గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ ప్రజలంతా రాజకీయాలకు అతీతంగా ఒక్కతాటిపైకి వచ్చి నిర్వహించిన ఈ ఛలో ఎంపీడీవో కార్యాలయం పాదయాత్ర జూలపల్లి గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇలాంటి సామూహిక ఉద్యమాలు మరింత బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు రైతులు గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సూచించారు మబ్బులు పట్టి వర్ష తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరియు పాతబడిన, ఇళ్లలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇళ్లు కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉంటే వెంటనే సురక్షితమైన వేరే ప్రాంతాలకు లేదా వేరే ఇళ్ల కు మారాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అనవసర ప్రయాణాలు చేయవద్దని, పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు మరియు రోడ్లపై ప్రవహిస్తున్న ఉధృతమైన నీటిని దాటే ప్రయత్నం ఎవరూ చేయవద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. బాధితులకు అవసరమైన సహాయక చర్యలను అధికారులు అందించాలని కోరారు..

## పడకల్ గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



**ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయిన సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి, మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి పడకల్ గ్రామంలోని పలు ప్రజా సమస్యలను గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి అత్యవసరమైన పనులను త్వరితగతిన చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. తలకొండపల్లి--రవిచెడ్ బీటీ రహదారి నిర్మాణం, పెద్దూర్ తండా నుంచి పడకల్ వరకు బీటీ రహదారి ఏర్పాటు, గ్రామంలోని పాత ఐరన్ విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం, లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామానికి వెటర్నరీ వైద్యులను నియమించడం, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమస్యలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ డోకురి సునీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం సహకారంతో పడకల్ గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి ఎంపీడీవో సులోచన, అన్ని గ్రామాల అధికారులు తది తరులు పాల్గొన్నారు.

## ప్రజలపై ఎల్ ని నో ప్రభావం పడకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

**సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**




రైతులు ప్రత్యమ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ సూచించారు. వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఎల్ నినో ప్రభావం పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా ఉంటుందని అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యమ్నాయ పంట లను సాగు చేసుకోవాలని, తద్వారా పంట మార్పిడి చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీఓ సులోచన, మండల వ్యవసాయాధికారి శోభ రాణి, ఏఈఓ రాజు, పంచాయతీ కార్యదర్శి గిరి, ఉప సర్పంచి బస్నమోని శ్రీనివాస్ , వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్ అనిత మల్లేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



తలకొండపల్లి మండలంలోని దేవునిపడకల్ గ్రామానికి చెందన బక్కి పుల్లయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. స్థానిక సర్పంచ్ అనిత మల్లేష్ ద్వారా విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ 3 వేల రూపాయలు ఆర్థిక సహాయము అందజేశారు. అలాగే దేవునిపడకల్ గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ 3000 అందించారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబటి వెంకటేష్, వార్డ్ సభ్యులు స్వామి గౌడ్ , జ్యోతిలక్ష్మయ్య, పెద్దలు ,మద్దూరి సత్యం ,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్ .బక్కి స్వామి, పులిజాల మహేష్ , మరియు రాజమోని లక్ష్మయ్య గార్లు కలిసి వారి కుటుంబ సభ్యులకు బక్కి కార్తీక్ కి అందజేశారు .

# సింగరేణి కార్మికులకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి

**క్వార్టర్లలో నిలిచిన వరద నీటి తొలగింపునకు తక్షణ చర్యలు చేపట్టాలి: కార్మిక కుటుంబాలు**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

వర్షాల కారణంగా సింగరేణి కార్మికుల క్వార్టర్లలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేయాలని కార్మిక కుటుంబాలు సింగరేణి యాజమాన్యాన్ని కోరాయి. మున్సిపల్ కార్పొరేషన్ మాదిరిగా ఫిర్యాదులు స్వీకరించే హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటే అత్యవసర సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుంటుందని పేర్కొన్నాయి.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆర్జీ-1 ఏరియాలోని జీఎం కాలనీలో పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా టీ-2 క్వార్టర్లు నెం.153, 154తో పాటు మరికొన్ని క్వార్టర్లలో నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇళ్లలోకి చేరడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. దీంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వ నీటి కారణంగా దోమల బెడద, అంటువ్యాధుల ముప్పు కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొంటూ, యాజమాన్యం వెంటనే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి నిలిచిన వరద నీటిని తొలగించాలని కోరారు.




అదేవిధంగా వర్షాకాలంలో కార్మికులు ఎదుర్కొనే అత్యవసర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసి, సహాయక బృందాలను అందుబాటులో ఉంచి తక్షణ చర్యలు చేపట్టాలని కార్మిక కుటుంబాలు విజ్ఞప్తి చేశాయి.

# తప్పిపోయిన ఇద్దరు మైనర్ బాలికల గుర్తింపు

**పన్నెండు గంటల్లోనే సురక్షితంగా గుర్తించిన పోలీసులు**

**అగ్నిధార న్యూస్ సుల్తానాబాద్**

సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో గల బాలసదన్ చిల్డ్రన్ హోమ్ జులై ఇరువైతొమ్మిదివ రోజున తెల్లవారుజామున ఇద్దరు మైనర్ బాలికలు హాస్టల్ ప్రాంగణంలోని కాంపౌండ్ గోడ దూకి వెళ్లిపోయిన విషయం తెలియగానే పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డిఆదేశాల మేరకు వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగింది. నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, ఒక బృందాన్ని పెద్దపల్లి, మరో బృందాన్ని కరీంనగర్, మరో బృందాన్ని స్థానికంగా సమాచార సేకరణకు, ఇంకో బృందాన్ని బాలికల్లో ఒకరి బంధువుల గ్రామమైన పాలితం ప్రాంతానికి పంపించి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు ప్రయాణ మార్గాలు మరియు ఇతర సమాచారంతో బాలికలు సుల్తానాబాద్ చౌరస్తాకు చేరుకుని అక్కడి నుండి ఆటోలో పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లి, అక్కడ నుండి రైలులో భువనగిరికి చేరుకుని, అనంతరం బస్సులో నల్గొండకు వెళ్లినట్లు గుర్తించారు. అనంతరం నల్గొండ



బస్టాండులో ఉన్న ఇద్దరు బాలికలను పోలీసులు తప్పిపోయిన 12 గంటల వ్యవధిలోనే సురక్షితంగా గుర్తించి రక్షించారు. అనంతరం వారిని భద్రంగా తీసుకువచ్చి సంబంధిత అధికారులకు చట్టపరమైన విధానంలో అప్పగించారు.

ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సుల్తానాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నమనేని రంజిత్ రావు, సుల్తానాబాద్ ఎస్‌హెచ్‌ఓ చంద్రకుమార్, హెడ్ కానిస్టేబుళ్లు మహేందర్, కానిస్టేబుళ్లు వెంకటేష్, రవి, రమేష్, అరుణ్, సదానందం రేణుక అలాగే టెక్నికల్ టీమ్ సభ్యులు సమన్వయంతో పనిచేసి బాలికలను వేగంగా గుర్తించి రక్షించడంలో కీలక పాత్ర పోషించారనీ ఈ సందర్భంగా డీసీపీ రామ్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



సమన్వయం, అప్రమత్తత, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం వల్లే తక్కువ సమయంలో బాలికలను సురక్షితంగా గుర్తించడం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.ఇంత వేగంగా స్పందించి మైనర్ బాలికలను సురక్షితంగా గుర్తించి రక్షించినందుకు సుల్తానాబాద్ మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ విభాగం ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పోలీసు శాఖను అభినందించారు. చిన్నారుల రక్షణ విషయంలో పోలీసులు చూపిన అంకితభావం వేగవంతమైన చర్యలు ప్రశంసనీయమని కొనియాడారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు..

**అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి.**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి**

కమిషనరేట్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.పెద్దపల్లి,మంచిర్యాల జోన్లలోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఎవరైనా ఆపదలో చిక్కుకున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

### భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు....

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కమిషనరేట్ పరిధిలోని డ్యామ్‌లు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని,సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ అక్కడికి వెళ్లరాదని సూచించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు శాఖ తరఫున అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రజలు పోలీసుల సూచనలు, సలహాలను పాటిస్తూ సహకరించాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు,కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్ల రాదు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదు. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తాకరాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులు,నాలాలు, డ్యామ్‌లు, జలపాతాలు (వాటర్ ఫాల్స్) వద్దకు వెళ్లరాదు.చేపల వేట కోసం కూడా వెళ్లకూడదు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలి.స్థానిక రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్,ఆర్‌అండ్‌బీ, వైద్య శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ,వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న లేదా నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా ఇరువైపులా బ్యారికేడ్లు,ప్లాస్టిక్ కోన్‌లు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు,అలుగులు, ప్రధానరహదారులపై ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పోలీసు అధికారులు,సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వరద నీటి కారణంగా చెరువులు, కుంటలు నిండి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలి. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం,



గుంతలు ఏర్పడి వాటిలో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.కాబట్టి నెమ్మదిగా, అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.కల్వర్టులు,చిన్న వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలతో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని హెచ్చరించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు, కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని, పోలీసు సిబ్బంది 24 గంటల పాటు సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఎమ్మెల్సీ యాదవ రెడ్డి చేతుల మీదుగా ‘స్నేహితుల దినోత్సవం’ ప్రత్యేక పాట ఆవిష్కరణ

**అగ్నిధార న్యూస్ సిద్ధిపేట జిల్లా**

గజ్వేల్ పట్టణంలో “స్నేహితుల దినోత్సవం” పురస్కరించుకుని గేయ రచయిత రాయారావు విశ్వేశ్వరరావు రూపొందించిన ప్రత్యేక పాటను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ గేయ రచయిత రాయారావు విశ్వేశ్వరరావు రాసిన పాటలు ఎంతో అద్భుతంగా, శ్రోతలను ఆకట్టుకునేలా ఉన్నాయని కొనియాడారు. సమాజంలో స్నేహానికి ఉన్న విలువను, స్నేహితుల మధ్య ఉండే ప్రేమానురాగాలను చాలా చక్కగా ఈ పాటలో వర్ణించారని ప్రశంసించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, మాజీ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గోలి సంతోష్, ఆపన్న హస్తం మిత్రబృందం సభ్యులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కుమార స్వామి, గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య అధ్యక్షులు శంకర్ శర్మ, కోశాధికారి కృష్ణ మూర్తి శర్మ,రాజేశ్వర్,శరత్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుదాఘాతానికి గేదె మృతి

**విద్యుత్ తీగ తెగిపడడంతో ఘటన.. రూ.90 వేల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన**

**అగ్నిధార న్యూస్,,(రామగుండం):**



పాలకుర్తి మండలం 21వ డివిజన్ పరిధిలోని ఎల్కలపల్లి గేటు వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం, ఎల్కలపల్లి గేటుకు చెందిన పానుగంటి శంకర్‌కు చెందిన గేదె ఇంటి వెనుక ఉన్న పొలాల్లో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. వ్యవసాయ విద్యుత్ లైన్‌కు చెందిన తీగ తెగిపడి కరెంట్ స్తంభం సపోర్టు వైర్‌పై పడడంతో విద్యుత్ ప్రవహించింది. ఆ వైర్‌ను తాకిన గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రోజుకు సుమారు 10 లీటర్ల పాలు ఇచ్చే గేదె మృతి చెందడంతో తనకు దాదాపు రూ.80 వేల ఆర్థిక నష్టం వాటిల్లిందని యజమాని పానుగంటి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. విగతజీవిగా పడి ఉన్న గేదె వద్ద ఆయన కన్నీటి పర్యంతమైన దృశ్యం స్థానికులను కలచివేసింది.ప్రమాదానికి కారణమైన విద్యుత్ లైన్ లోపాలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, తనకు తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని పానుగంటి శంకర్ విజ్ఞప్తి చేశారు.

## సింగరేణి కార్మికులకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి

**క్వార్టర్లలో నిలిచిన వరద నీటి తొలగింపునకు తక్షణ చర్యలు తీసుకోవాలని కార్మిక కుటుంబాల విజ్ఞప్తి**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సింగరేణి కార్మికుల క్వార్టర్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేయాలని కార్మిక కుటుంబాలు యాజమాన్యాన్ని కోరాయి. మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో ఫిర్యాదులు స్వీకరించే ప్రత్యేక వ్యవస్థ ఉంటే అత్యవసర సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు.గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆర్జీ-1 ఏరియాలోని జీఎం కాలనీలో పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా టీ-2 క్వార్టర్లు నెం.153, 154తో పాటు మరికొన్ని క్వార్టర్లలో నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఇళ్లలోకి చేరి కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షపు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన, దోమల వ్యాప్తి, అంటువ్యాధుల ముప్పు కూడా పెరిగే అవకాశం ఉందని కార్మిక కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వెంటనే నీటి పారుదల చర్యలు చేపట్టి, అవసరమైన సహాయక బృందాలను రంగంలోకి దించాలని కోరారు.సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు క్వార్టర్లలో నిలిచిన వరద నీటిని తొలగించి కార్మిక కుటుంబాలకు ఉపశమనం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## లయన్స్ క్లబ్ సభ్యులు బాబురావు జన్మదినశీ సందర్బంగా అన్నదాన కార్యక్రమం




**అగ్నిధార న్యూస్ సిద్ధిపేట జిల్లా**

గజ్వేల్ పట్టణం ఇంటర్ నేషనల్ లయన్స్ క్లబ్ సభ్యులు బాబు రావు జన్మదినశీ సందర్భంగా గజ్వేల్ బస్టాండ్ వద్ద రిజనల్ ఛైర్పర్సన్ జిల్లా రమేష్ గజ్వేల్ లయన్స్ క్లబ్ సెక్రటరీ సుమన్ పేర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ సభ్యులు బాబు రావు అష్టయురాగ్యలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆయన జన్మదినశీ సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేయడం ఆ భగవంతుడని ఆశీస్సులు పొందినట్టుగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ సభ్యులు ఎల్ రాం రెడ్డి గుస్సా నాగేందర్ గంగిశెట్టి ఉమేష్ కలబ్ ప్రశాంత్ గాదె సంతోష్ లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో జగదేవపూర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జగదేవపూర్ ఎస్ఐ కృష్ణా రెడ్డి**

**అగ్నిధార న్యూస్ సిద్ధిపేట జిల్లా**



జగదేవపూర్ మండలం భారీ వర్షాల కారణంగా చెరువు కట్టలు తెగడం, మత్తడులు పొంగిపొర్లడం, రోడ్లు తెగిపోవడం లేదా దెబ్బతినడం, లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడం, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపడటం, చెట్లు విరిగిపడటం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరం కాని ప్రయాణాలను నివారించాలని, చెరువులు, వాగులు, మత్తడులు, వరద నీరు ప్రవహించే రోడ్లు, కల్వర్టుల వద్దకు వెళ్లకూడదని స్థానిక ఎస్ ఐ కృష్ణా రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కూలిపోయిన విద్యుత్ స్తంభాలు లేదా తెగిపడిన విద్యుత్ తీగలను తాకకుండా దూరంగా ఉండాలని తెలిపారు. చెరువు కట్టలు తెగడం, మత్తడి పొంగడం, రోడ్లు తెగిపోవడం, వరద నీటిలో చిక్కుకోవడం లేదా ఇతర ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లయితే వెంటనే డయల్-100 ద్వారా జగదేవపూర్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కృష్ణా రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అగ్నిధార http://www.agnidharanews.com

# యంగ్ ఇండియా పాఠశాలను జగదేవపూర్ కు మంజూరు చేయాలి

యంగ్ ఇండియా పాఠశాల సాధన సమితి డిమాండ్

తహసీల్దార్ కు వినతి పత్రం అందజేత

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ యంగ్ ఇండియా పాఠశాలను జగదేవపూర్ మండలంలో నిర్మించాలని యంగ్ ఇండియా పాఠశాల సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు . ఈ మేరకు గురువారం జగదేవపూర్ మండల తహసిల్దార్ నిర్మల కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడానికి పేద విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలోనీ ప్రతి నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా పాఠశాలను నిర్మించడానికి నిర్ణయించిదన్నారు . అందులో భాగంగా గజ్వేల్ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేశారని, దీనిని నియోజకవర్గంలో ఎక్కడ నిర్మించాలనే విషయం పై అధికారులు పలు ప్రాంతాలను సందర్శించి నివేదిక సమర్పించినట్లు తెలిసిందన్నారు. జగదేవపూర్ గ్రామ సరిహద్దులోనీ పీర్లపల్లి గ్రామానికి చెందిన ఎండపల్లి యాదగిరిరెడ్డి విద్యాశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిర్మాణానికి 41.28 ఎకరాల భూమిని దానంగా ఇవ్వడం జరిగిందని అట్టి స్థలం విద్యాశాఖ ఆధీనంలోనే ఉందని, కాబట్టి యంగ్ ఇండియా పాఠశాల ఇక్కడ నిర్మిస్తే భూమిని కాపాడుకోవడం తోపాటు మూడు జిల్లాల సరిహద్దులో వెనకబడి ఉన్న ఈ ప్రాంతంలోని పేద విద్యార్థులకు, యువతకు మంచి విద్య అవకాశాలు కల్పించినట్లు అవుతుందని తెలిపారు. జగదేవపూర్ మండలానికి యంగ్ ఇండియా పాఠశాల తీసుకురావడానికి యంగ్ ఇండియా సాధన సమితి ఆధ్వర్యంలో మనందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో పాటు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చి అధికారులకు వినతి పత్రాలు సమర్పించి జగదేవ్ పూర్ లో యంగ్ ఇండియా పాఠశాల ఏర్పాటు అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. యంగ్ ఇండియా పాఠశాలను సాధించడానికి వివిధ రూపాలలో నిరసన తెలియజేయడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు ఓం ప్రకాష్, శ్రీనివాస్ గౌడ్, ఎల్లేష్, రాజు, పద్మారావు, జ్యోతి మహేష్, దీన రాజలింగం, రజిత పరుశురాం, యంగ్ ఇండియా పాఠశాల సాధన సమితి సభ్యులు కృష్ణ, శ్రీధర్, నరసింహులు, సురేష్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సీనియర్ న్యాయవాది సర్ధార్ కు సన్మానం

గురువును మించిన దైవం లేదు.

అగ్నిధారన్యూస్ హనుమకొండ

గురుపౌర్ణమి పురస్కరించుకొని హనుమకొండ జిల్లా బార్ సీనియర్ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ సర్దార్ ను ఆయన వద్ద వృత్తి పాఠాలను పొందిన న్యాయవాదులు సన్మానం చేసారు. గురువారం పరిమళ కాలనీలోని ఆయన నివాసంలో శాలువ కప్పి క్రిమినల్ లా పుస్తకం బహుకరించి సన్మానం చేసారు. హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జంగ స్వప్న, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు జన్ను పద్మ, న్యాయవాదులు దొంగల సతీష్, తుల్సిగారి రాజబాపు, బరుపటి వినయ్, బండ రేష్మ లు సన్మానం చేసి మాట్లాడారు. మానవ మనుగడకు తల్లితండ్రుల తర్వాత గురువులు ప్రధాన పాత్ర పోషిస్తారని అలాంటి గురువులను సత్కరించుకోవడం గొప్ప విషయమని వారన్నారు. కంప్యూటర్ యుగం ప్రారంభమైన తర్వాత జూనియర్ న్యాయవాదులకు వృత్తి పరమైన మెలుకువలు, జ్ఞానం అందించడంలో సీనియర్లు నిర్లక్ష్యం చేస్తున్న నేటి కాలంలో ఎంతమంది జూనియర్లు వచ్చిన శ్రమ అనుకోకుండా కేసులకు సంబంధించిన వృత్తి పరమైన మెలుకువలను ఉచితంగా నేర్పించే సర్ధార్ గొప్ప వ్యక్తిత్వానికి అందరూ సలాం చేయాలని అన్నారు. తన ఆరోగ్య సమస్యతో వీల్ చైర్ లో వచ్చి కూడా కోర్టులో కేసులు వాదించడమే కాకుండా ఆఫీసులో జూనియర్లకు శిక్షణ ఇవ్వడంలో తనకు తానే సాటి అని అన్నారు. ఫీజులు చెల్లించుకోలేని పేద విద్యార్థులకు కూడా సహాయం అందుస్తున్న సర్దార్ మానవీయ కోణాన్ని సమాజం ఆచరించాలని, దేవుడు ఉన్నాడో లేదు తెలియదు కాని గురువును మించిన దేవుడు లేడని వారన్నారు. ఈ సందర్బంగా సర్ధార్ మాట్లాడుతూ మనకున్న జ్ఞానం ఇతరులకు పంచినప్పుడే అది జ్ఞానం అవుతుందని నా శక్తి మేరకు జూనియర్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చి వారిని వృత్తిలో నిలదొక్కుకునేటట్లు చేయడమే నా లక్ష్యమని అన్నారు. నా కూతురు జడ్జి, నా కొడుకు హై కోర్టులో న్యాయవాది అని నా కుటుంబ సభ్యుల లాగానే కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన వారు ఎదగాలని ఆయన అన్నారు.



# పెద్దపల్లి ప్రజల చిరకాల కల బస్సు డిపో...

## దసరా వరకు ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులు పూర్తి..

## నూతన బస్సు డిపోతో పెరగనున్న రవాణా సౌకర్యాలు..

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..

## ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు..

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి పరిశీలించిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ..

**ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు ..**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న బస్సు డిపో పనులను తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి పరిశీలించడం జరిగింది అని దసరా వరకు పెద్దపల్లి బస్సు డిపో ప్రారంభించే దిశగా పనులు త్వరత్వరగా జరిగేల ఎం.డి అధికారులకు కాంట్రాక్టర్ కు తెలిపారని అన్నారు. బస్సు డిపో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లల్లో బస్సు డిపో ఉన్నప్పటికీ మొదటి నుండి పెద్దపల్లి కూడా రేవెన్యూ డివిజన్ అయినప్పటికీ కూడా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో డిపో లేకపోవడం సిగ్గ చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష అయిన బస్సు డిపో మంజూరు చేయమని వినతి పత్రం అందజేసిన తర్వాత వారు పెద్దపల్లి ప్రజలపై ఉన్న మమకారంతో 2024 డిసెంబర్ మాసంలో పెద్దపల్లి ప్రాంతానికి విచ్చేసి యువ వికాసం బహిరంగ సభలో బస్సు డిపో మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి బస్సు డిపోను దసరా వరకు పూర్తి చేస్తామని ఆర్టీసీ ఎండీ తెలిపారని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, ఆర్టీసీ అధికారులు, పట్టణ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## 21 ఏళ్ల లిమిట్ పై పెరుగుతున్న మద్దతు

**హైదరాబాద్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో వయోపరిమితి అంశం ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసేందుకు ప్రస్తుతమున్న కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో కొత్త సంచలనాన్ని రేపింది. ఈ అంశంపై తెలంగాణ అసెంబ్లీలో త్వరలోనే ఒక అధికారిక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని ఆయన స్పష్టం చేశారు. నేటి యువతలో ఆలోచనా పరిపక్వత పెరిగిందని, దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న యువత చట్టసభల్లో తమ వాయిస్‌ను బలంగా వినిపించాల్సిన అవసరం ఉందన్నది రేవంత్ రెడ్డి ప్రధాన వాదన.ఈ ప్రతిపాదనకు పార్టీల సరిహద్దులు దాటి మద్దతు లభించడం విశేషం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి, రేవంత్ రెడ్డి ఆలోచనను బహిరంగంగా ఆహ్వానించారు. సోషల్ మీడియా వేదికగా తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉన్న ప్రతి యువకుడికీ రాజ్యాంగం, సమాజంలో మార్పులు, ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే చైతన్యం ఉన్న 21 ఏళ్ల యువతకు చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఇప్పటికే పలు అభివృద్ధి చెందిన దేశాలు 21 ఏళ్లకే పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్న విషయాన్ని కూడా నేతలు గుర్తుచేస్తున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారం కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా జాతీయ రాజకీయాల్లోనూ వేడి పుట్టిస్తోంది. కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ప్రతిపాదనకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. రాహుల్ గాంధీ నాయకత్వంలో యువతకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో భాగంగా, త్వరలోనే 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా దీనిపై చర్చించి ఒక ఉమ్మడి నిర్ణయానికి వచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.79 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన మనం, రాజ్యాంగపరంగా 21 ఏళ్లకు చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదనే ప్రశ్నకు ఇప్పుడు బలం చేకూరుతోంది. అయితే, కేవలం డిజిటల్ చైతన్యం సరిపోతుందా లేదా రాజకీయ పరిణతి అనుభవంతోనే వస్తుందా అనే కోణంలో రాజ్యాంగ నిపుణులు, పార్లమెంటేరియన్లు ఈ అంశాన్ని ఎంతవరకు సీరియస్‌గా తీసుకుంటారో వేచి చూడాలి. ఏది ఏమైనా, 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు వయోపరిమితిని తగ్గించాలనే ఈ డిమాండ్ రాబోయే రోజుల్లో భారత రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## మెట్రోపై అప్ డేట్...

**హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ ప్రాజెక్టు కేంద్ర కేబినెట్ అనుమతుల కోసం సిద్ధమవుతుండగా.. రెండు నెలల్లోగా తొలిదశ స్వాధీన ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎఖీఈఅ రుణం నిలిచిపోవడంతో, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ వంటి ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ సంస్థల ద్వారా రూ.13,527 కోట్ల రుణ సమీకరణకు హెచ్ఎంఆర్ కసరత్తు చేపట్టింది. నిర్ణయించిన గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయడంపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. కాగా, కొత్తగా రాష్ట్ర ప్రభుత్వ పలు మార్గాల్లో మెట్రోను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ అనుమతుల ప్రక్రియ వేగవంతమైంది. రానున్న రెండు నెలల్లో ఈ అంశాన్ని కేంద్ర క్యాబినెట్ ముందుకు తీసుకురానున్నట్లు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి స్పష్టం చేసింది. అయితే, అప్పటిలోగా మెట్రో తొలిదశ స్వాధీన ప్రక్రియను పూర్తి చేయాలని తేల్చిచెప్పింది. ఢిల్లీలో గత వారం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ ఎండీ సమావేశమయ్యారు. తొలిదశ స్వాధీనంలో జాప్యం, రెండోదశ అనుమతుల్లో ఆలస్యం వల్ల ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను రాష్ట్ర అధికారులు ఈ భేటీలో వివరించారు. తొలిదశతో రెండోదశను ముడిపెట్టవద్దని కోరినప్పటికీ, రెండు దశల అనుసంధానానికి స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా తెలిపారు.తొలిదశ స్వాధీన ప్రక్రియ మే నెలాఖరు నాటికే ముగియాల్సి ఉన్నప్పటికీ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందవలసిన రూ.13,527 కోట్ల రుణ మంజూరు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో జాప్యం జరుగుతోందని అధికారులు తెలిపారు. కేంద్రం నుంచి ఎన్వోసీ రాకపోవడంతో ఈ నిధులు విడుదల కాలేదన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఢిల్లీ పర్యటనలు, కేంద్ర మంత్రులతో చర్చల అనంతరం తొలిదశ విలువ నిర్ధారణకు, నూతన రుణాల సేకరణకు ఎస్‌బీఐ క్యాప్స్‌ను కన్సల్టెంట్‌గా నియమించాలని నిర్ణయించారు. అయితే, ఆ తర్వాత నెలన్నర రోజులుగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో అధికారులు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. రెండు నెలల్లోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే నూతన రుణ సమీకరణ కీలకం కానుంది. ఎఖీఈఅ తప్పుకున్నట్లు కేంద్రం సంకేతాలు ఇవ్వడంతో జైకా తరహాలోనే 3.5 శాతం వడ్డీ రేటుకు కొత్తగా ాఃఎ, ఎఅఎఅఎ వంటి ప్రముఖ బ్యాంకింగ్ సంస్థల ద్వారా రుణం సమకూర్చుకునే మార్గాలపై హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కసరత్తు ప్రారంభించింది. రుణమిచ్చే సంస్థల ఎంపిక కోసం ప్రత్యేకంగా ఏజెన్సీని నియమించే ఆలోచనలో ఉంది. గతంలో ఎఖీఈఅతో ఒప్పందానికి ఆరు నెలలకు పైగా సమయం పట్టగా.. ఇప్పుడు కేవలం రెండు నెలల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయడం క్లిష్టతరమని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇదే అంశంపై హైదరాబాద్‌లో మంగళవారం జరగాల్సిన కీలక బోర్డు సమావేశం వివిధ కారణాలతో వాయిదా పడింది.కాగా, ప్రస్తుతం ఎల్బీనగర్- మియాపూర్, నాగోల్- రాయదుర్గం, ఎంజీబీఎస్- పరేడ్ గ్రౌండ్స్ మధ్య మూడు మార్గాల్లో మెట్రో పరుగులు పెడుతుండగా.. కొత్తగా ఎంజీబీఎస్-చంద్రాయన్ గుట్ట, శంషాబాద్, ఎల్బీనగర్- హయత్ నగర్, సికింద్రాబాద్-మేడ్చల్ వరకు మెట్రో ప్రతిపాదనలు ఉన్నాయి.

## వరుదు కల్యాణికి మొండి చేయేనా

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ స్థానం ఖాళీ కావడం, దాని చుట్టూ ఇప్పుడు వైసీపీ అంతర్గత రాజకీయాల్లో నడుస్తున్న డ్రామాలు చూస్తుంటే సామాన్య కార్యకర్తలకు ఇదేం మాస్టర్ ప్లాన్ సామీ అని తలపట్టుకోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు. మండలి వైస్ చైర్‌పర్సన్ జకియా ఖానమ్ పదవీకాలం ముగిసిపోయింది. ప్రస్తుతం మండలిలో వైసీపీకి ఇంకా సంఖ్యాబలం ఉంది కాబట్టి, ఆ ఉపసభాపతి పీఠం ఆ పార్టీకే దక్కనుంది. సరిగ్గా ఇక్కడే జగన్ మోహన్ రెడ్డి మార్క్ అన్ ప్రిడిక్టబుల్ వ్యూహం మళ్లీ రచ్చకెక్కింది.సాధారణ పొలిటికల్ లాజిక్ ప్రకారం ఆలోచిస్తే.. ప్రస్తుతం పార్టీ ఘోర పరాజయం తర్వాత కోలుకోవడానికి కూటమికి బదులిచ్చే సామాజిక సమీకరణాలు వాడాలి. పోయిన స్థానం ముస్లిం మైనారిటీది కాబట్టి మళ్లీ అదే వర్గానికి ఇస్తే ఆ సామాజిక వర్గానికి మంచి సంకేతం వెళ్తుంది. లేదా, కూటమిని డిఫెండ్ చేయడానికి కాపులకో, లేదంటే గట్టిగా వాయిస్ వినిపించే బిసి వర్గానికి చెందిన వరుదు కల్యాణి లాంటి నాయకురాలికో ఆ అవకాశం ఇవ్వాలి. పొద్దున లేస్తే మైకుల ముందు నిలబడి, కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతూ పార్టీ జెండా మోస్తున్న వరుదు కల్యాణి లాంటి వారికి ఇస్తే క్యాడర్‌లో కూడా ఒక రకమైన జోష్ వస్తుంది. లేదంటే తమ పక్కా ఓటు బ్యాంక్ అయిన దళితులకో, రెడ్డి సామాజిక వర్గానికో ఇచ్చి సంతృప్తి పరచవచ్చు.కానీ, వైఎస్ జగన్ ఆలోచనలు వేరే స్థాయిలో ఉంటాయి కదా! రాజకీయంలో లాజిక్కులు వెతికేవారికి ఆయన ఎప్పుడూ షాక్‌లే ఇస్తారు. ఏ రాజకీయ లెక్కలకూ అందకుండా, ఈ కీలక పదవిని కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాధవరావుకు అప్పగించాలని డిసైడ్ అయ్యారట. టీవీ డిబేట్లలోనో, బయటో పార్టీ కోసం గట్టిగా మాట్లాడలేని, రేపు పొద్దున పార్టీలో ఉంటారో లేదో కూడా గ్యారంటీ లేని నేతకు ఈ చాన్స్ ఇవ్వడం చూసి వైసీపీ సొంత నేతలే జుట్టు పీక్కుంటున్నారు. మాట్లాడేవారికి పదవులు ఉండవు.. పదవులు వచ్చేవారు మాట్లాడరు అనే కొత్త సూత్రాన్ని జగన్ ఇక్కడ అమలు చేస్తున్నారని పార్టీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.మైకుల ముందు నిలబడి గొంతు చించుకునే వరుదు కల్యాణి లాంటి నేతలకు కేవలం ప్రెస్ మీట్లకే పరిమితం చేసి, ఏమాత్రం సౌండ్ చేయని నేతలకు పీఠాలు అప్పగించే ఈ జగన్ మార్క్ సర్‌ప్రైజ్ రాజకీయం చూసి ప్రత్యర్థులు నవ్వుకుంటుంటే, సొంత కార్యకర్తలు

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com